# మహా న్యూస్

www.mahinewsindia.com

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను

మహా న్యూస్

తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న మహా న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

-: సంప్రదించండి :-

9059585898



ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. | సంపుటి : 02 | సంచిక : 194 | ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య, | పేజీలు : 8, | వెల రూ. 2 | బుధవారం -14 - అక్టోబర్ - 2026

published From :YSR Kadapa circulated by Kurnool I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana

## మరోసారి చెపుతున్నా.. అధికారం జెన్-జీది, నాది బాల్ థాకరే పాత్ర: విజయసాయిరెడ్డి

- కొత్త పార్టీ ఏర్పాటుపై స్పష్టత ఇచ్చిన విజయసాయిరెడ్డి
- దసరా నాటికి పేరు, జెండా, ఎజెండా సిద్ధమవుతాయని ప్రకటన
- రెండు కుటుంబ పార్టీలపై తిరుగుబాటే తన లక్ష్యమన్న విజయసాయి
- గత ఎన్నికల తర్వాత వైసీపీకి దూరమైన విజయసాయి

# నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలకు రిజర్వేషన్లు ఖరారు

### 123 పట్టణ స్థానిక సంస్థల్లో బీసీలకు 41.. ఎస్సీలకు 16

- ఎస్టీలకు 4 కేటాయింపు
- మహిళలకు 50 శాతం సీట్లు
- కర్నూలు, రాజమహేంద్రవరం కార్పొరేషన్లు ఎస్సీలకు; మంగళగిరి-తాడేపల్లి ఎస్టీకి
- 50 శాతం స్థానాల్లో మహిళలే గద్దెనెక్కనున్నారు. నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల్లో వార్డుల వారీ రిజర్వేషన్లు కూడా విడుదల
- శ్రీకాకుళం, అనకాపల్లి జిల్లాల్లో మహిళలదే పైచేయి..

అమరావతి : నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల ఎన్నికలకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. 17 నగరపాలక సంస్థల్లో మేయర్ పదవులను ఎస్టీ-1, ఎస్సీ-2, బీసీ-5, మహిళలు (జనరల్)-5, జనరల్ (అన్‌రిజర్వ్‌డ్)కు 4 కేటాయించారు. 106 పురపాలక సంఘాల్లో ఎస్టీ-3, ఎస్సీ-14, బీసీ-36, మహిళలు(జనరల్)-27, అన్ రిజర్వ్‌డ్‌కు 26 ఛైర్‌పర్సన్ పదవులు కేటాయిస్తూ సోమవారం పురపాలకశాఖ గెజిట్ విడుదల చేసింది. మొత్తం 123 నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల్లో.. మిగతా 2 లో

## నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారికి గుడ్ న్యూస్..

### పదవీకాలం పెంచిన ఏపీ ప్రభుత్వం



- వివిధ కార్పొరేషన్లలో నామినేటెడ్ పదవుల కాలపరిమితి పొడిగింపు
- మరో రెండు నెలల పాటు పదవీకాలం పెంచుతూ ప్రభుత్వ ఉత్తర్వులు
- సంక్షేమ, అభివృద్ధి పనుల కొనసాగింపు కోసమే ఈ నిర్ణయం అన్న ప్రభుత్వం

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం

## జంతర్‌మంతర్ బంద్.. రామ్‌లీలాలో గళం విప్పాలంటే రోజుకు రూ.1.21 లక్షలు!

- రామ్‌లీలా మైదాన్‌లో ఒక్కరోజు బుకింగ్‌కు రూ.1.21 లక్షల వరకు ఖర్చు
- ఈ ఏడాది డిసెంబరు 29, 30, 31 తేదీల్లోనే బుకింగ్ అవకాశం
- ఉచిత నిరసన ప్రాంతంలో 150 మందికే అనుమతి
- జంతర్ మంతర్ స్థానంలో మూడు కొత్త నిరసన వేదికలు
- మైదాన్ బుకింగ్‌కు ఢిల్లీ పోలీసుల నిరభ్యంతర పత్రం తప్పనిసరి

## మోదీపై వ్యాఖ్యలు.. పరువు నష్టం కేసులో రాహుల్‌కు సుప్రీంలో తాత్కాలిక ఊరట

- పరువునష్టం కేసు విచారణపై కింది కోర్టు విచారణపై స్టే
- మహారాష్ట్ర ప్రభుత్వం, ఫిర్యాదుదారుకు నోటీసులు
- నాలుగు వారాల్లో స్పందన తెలియజేయాలని ఆదేశం

## ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ కారిడార్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భేటీ

ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ కారిడార్‌కు ఆమోదం

కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జ్‌ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

# సీట్ల సర్దుబాటుపై చర్చలు.. పవన్ కల్యాణ్‌తో కూటమి నేతల భేటీ

### స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి సీట్ల సర్దుబాటుపై కూటమిలో చర్చలు

అమరావతి: ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి సీట్ల సర్దుబాటుపై కూటమిలో చర్చలు కొనసాగుతున్నాయి. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో తెదేపా ముఖ్యనేతలు భేటీ అయ్యారు. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడు, జనసేన తరఫున మంత్రి నాదెండ్ల మనోహర్, వంశీ కృష్ణ, చిల్లపల్లి శ్రీనివాస్ తదితరులు భేటీలో పాల్గొన్నారు. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఆధ్వర్యంలో చర్చలు జరిపిన నేతలు.. ఏయే చోట్ల ఏ పార్టీ తరఫున అభ్యర్థులను బరిలోకి దించాలన్నదానిపై చర్చించారు. తాజాగా..

పవన్ కల్యాణ్‌తో ఆయా పార్టీల ముఖ్యనేతలు చర్చిస్తున్నారు.

## సింగరేణి కార్మికులకు దసరా ధమాకా.. ఒక్కొక్కరికి రూ.1.53 లక్షల వరకు బోనస్!

### సింగరేణి పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులకు దసరా బోనస్

- కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చెల్లింపు
- పర్మినెంట్ కార్మికులకు లాభాల్లో 34 శాతం వాటా
- అర్హులైన పర్మినెంట్ కార్మికులకు గరిష్ఠంగా రూ.1,53,913
- పండుగకు ముందే ఖాతాల్లో బోనస్ జమ చేయనున్న యాజమాన్యం

హైదరాబాద్: దసరా పండుగ వేళ సింగరేణి కార్మికులకు తీపి కబురు అందింది. సంస్థలో పనిచేస్తున్న శాశ్వత కార్మికులతో పాటు కాంట్రాక్టు వారికీ బోనస్ ప్రకటించారు. కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి మిగతా 2 లో

## విదేశీ శక్తులతో కలిసి కమ్యూనిస్టుల కుట్ర: కిషన్ రెడ్డి

- కమ్యూనిస్టులు, కాంగ్రెస్ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయని కిషన్ రెడ్డి ఆరోపణ
- వారి ధర్నాల వల్లే ఢిల్లీ మార్కెట్లు దెబ్బతిన్నాయని వ్యాఖ్య
- పండుగ సీజన్‌లో చిన్న వ్యాపారులను నష్టపరుస్తున్నారన్న కేంద్రమంత్రి

# ఢిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతా? కాంగ్రెస్‌పై కిషన్ రెడ్డి ఆగ్రహం

### తెలంగాణలో మాత్రం బీజేపీ నేతల నిరసనలను ఉక్కుపాదంతో అణచివేస్తున్నారు

- ప్రజాస్వామ్య హక్కులపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందన్న కిషన్ రెడ్డి
- ఢిల్లీలో కాంగ్రెస్ నిరసనలను అడ్డుకోవడం లేదన్న కేంద్ర మంత్రి
- తెలంగాణలో బీజేపీ నేతలను గృహ నిర్బంధం చేస్తున్నారని ఆరోపణ
- రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పర్యటిస్తూ ప్రధాని మోదీని, ఎన్నికల సంఘాన్ని, న్యాయవ్యవస్థను, సైన్యాన్ని విమర్శిస్తున్నారు

హైదరాబాద్: ప్రజాస్వామ్య హక్కుల విషయంలో కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. ఢిల్లీలో కాంగ్రెస్ నేతలు స్వేచ్ఛగా నిరసనలు చేస్తుంటే అనుమతిస్తున్నామని, కానీ కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో మాత్రం బీజేపీ నేతల నిరసనలను ఉక్కుపాదంతో అణచివేస్తున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణలో రైతుల సమస్యలు, పోలీసు నియామకాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల వంటి ప్రజా సమస్యలపై నిరసన మిగతా 2 లో

## హాస్టళ్లకు సరుకుల సరఫరా స్థానిక వెండర్లకే ఇవ్వాలి: హరీశ్ రావు

- హాస్టళ్ల సరకుల సరఫరాకు పీఎంయూ టెండర్లు రద్దు చేయాలని హరీశ్‌రావు డిమాండ్
- స్థానిక వెండర్ల ద్వారానే డీపీసీ పద్ధతిలో సరకులు అందించాలని సూచన
- దీనివల్ల చిరు వ్యాపారులకు మేలు, విద్యార్థులకు నాణ్యత అందుతుందని వెల్లడి
- కమీషన్ల కోసం బ్లాక్‌లిస్ట్ సంస్థకు టెండర్ ఇచ్చారని తీవ్ర ఆరోపణ
- పాత విధానం తేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరిక

# సింగరేణి కార్మికులకు దసరా ధమాకా.. ఒక్కొక్కరికి రూ.1.53 లక్షల వరకు బోనస్!

హైదరాబాద్: దసరా పండుగ వేళ సింగరేణి కార్మికులకు తీపి కబురు అందింది. సంస్థలో పనిచేస్తున్న శాశ్వత కార్మికులతో పాటు కాంట్రాక్టు వారికీ బోనస్ ప్రకటించారు. కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున చెల్లించనున్నారు. మరోవైపు సంస్థ నికర లాభాల్లో 34 శాతం వాటాను పర్మినెంట్ కార్మికులకు పంపిణీ చేయనున్నారు. దీంతో సింగరేణి కార్మికుల ఇళ్లలో పండుగ సందడి నెలకొంది. సింగరేణి సాధించిన నికర లాభాల్లో 34 శాతాన్ని పర్మినెంట్ కార్మికులకు బోనస్‌గా అందించాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు అర్హులైన ప్రతి కార్మికుడికి గరిష్ఠంగా రూ.1,53,913 వరకు అందనుంది. పండు గకు ముందే ఈ మొత్తాన్ని కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు యాజమాన్యం వెల్లడించింది. గతేడాది తరహాలోనే ఈసారి కూడా కాంట్రాక్టు కార్మికులకు బోనస్ అందించనున్నారు. ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున చెల్లించ నున్నారు. దీంతో సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల కుటుంబాల్లోనూ దసరా ఆనందం నిండ నుంది. బొగ్గు గనుల్లో రేయింబవళ్లు శ్రమిస్తూ సంస్థ అభివృద్ధికి తోడ్పడుతున్న కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని యాజమాన్యం పేర్కొంది. పండుగ వేళ బోనస్ ప్రకటనతో కార్మికుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

### మోదీపై వ్యాఖ్యలు.. పరువు నష్టం కేసులో

# రాహుల్‌కు సుప్రీంలో తాత్కాలిక ఊరట

ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎదుర్కొంటున్న పరువునష్టం కేసులో సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసులో కింది కోర్టు విచారణపై మధ్యంతర స్టే విధించింది. రాహుల్ పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని మహారాష్ట్ర ప్రభుత్వం, ఫిర్యాదుదారుకు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పరువునష్టం కేసును కొట్టివేయాలన్న రాహుల్ అభ్యర్థనను బాంబే హైకోర్టు గతంలో తిరస్కరించింది. ఈ ఉత్తర్వులను ఆయన సుప్రీంకోర్టులో సవాలు చేశారు. రాహుల్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపించారు. తదుపరి విచారణ జరిగే వరకు కింది కోర్టు ప్రక్రియను నిలిపివేస్తూ ధర్మాసనం ఆదేశాలిచ్చింది. 2018 సెప్టెంబరులో రాజస్థాన్‌లో జరిగిన ఓ సభలో ప్రధాని మోదీని ఉద్దేశించి రాహుల్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని బీజేపీ నేత మహేశ్ ముకుంచంద్ శ్రీశ్రిమాల్ ఫిర్యాదు చేశారు. 'చోరోంకే సర్దార్', 'కమాండర్ ఇన్ థీఫ్' వంటి పదాలతో ప్రధాని ప్రతిష్ఠకు భంగం కలిగించారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు బీజేపీ సభ్యుల గౌరవాన్ని కూడా దెబ్బతీశాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదులోని అంశాలను పరిశీలించిన గిర్గావ్ మెజిస్ట్రేట్ కోర్టు 2019 ఆగస్టులో రాహుల్‌కు సమన్లు జారీ చేసింది. ఈ క్రిమినల్ చర్యలను రద్దు చేయాలని ఆయన బాంబే హైకోర్టును ఆశ్రయించారు. అయితే, సమన్ల జారీలో స్పష్టమైన చట్టవిరుద్ధత కనిపించడం లేదంటూ సెప్టెంబరు 8న హైకోర్టు ఆయన పిటిషన్‌ను తిరస్కరించింది. వ్యాఖ్యలు పరువునష్టం కిందకు వస్తాయా? వాటి ప్రభావం ఎంత? అన్నది విచారణలో తేలాల్సి ఉందని పేర్కొంది. సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు రాహుల్‌కు ఆరు వారాల పాటు మెజిస్ట్రేట్ ఎదుట హాజరు నుంచి మినహాయింపు కూడా ఇచ్చింది.

### ఇంద్రకీలాద్రిపై తమిళనాడు సీఎం విజయ్..

# కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు

అమరావతి: తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ మంగళవారం విజయవాడలో పర్యటించారు. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన ఆయన, ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. చెన్నై నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న ఆయన, అక్కడి నుంచి నేరుగా ఇంద్రకీలాద్రికి బయలుదేరారు. ఆలయానికి చేరుకున్న సీఎం విజయ్‌కు అర్చకులు సంప్రదాయబద్ధంగా పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన అమ్మవారిని దర్శించుకోగా, పండితులు వేదాశీర్వచనం అందించి, తీర్థప్రసాదాలను అందజేశారు. విజయ్ ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి రాష్ట్రానికి రావడంతో విజయవాడ నగరంలో కోలాహలం నెలకొంది. ఆయన రాకను తెలుసుకున్న అభిమానులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో గన్నవరం విమానాశ్రయానికి తరలివచ్చారు. ఆయన కాన్వాయ్‌ను అనుసరిస్తూ అభిమానులు తమ ఉత్సాహాన్ని చాటుకున్నారు.

### ఏజెన్సీలోని కానిస్టేబుల్ పోస్టుల్లో ఎస్టీలకు

# 75 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి: కవిత డిమాండ్

హైదరాబాద్: తెలంగాణ ఏజెన్సీ ప్రాంతాల్లోని కానిస్టేబుల్ పోస్టుల్లో షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ)కు 75 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే జోక్యం చేసుకోవాలని ఆమె కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1988లో జారీ చేసిన జీవో 109, తెలంగాణ ఏర్పడిన తర్వాత 2018లో విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ 49 ప్రకారం ఏజెన్సీ ప్రాంతాల్లోని కానిస్టేబుల్ ఉద్యోగాల్లో ఎస్టీలకు 75 శాతం రిజర్వేషన్ కల్పించాలని కవిత పేర్కొన్నారు. అయితే, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఇటీవల జారీ చేసిన 2026 పోలీస్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌లో ఈ నిబంధనను అమలు చేయలేదని ఆమె ఆరోపించారు. దీనివల్ల ఆదివాసీ, గిరిజన యువత కానిస్టేబుల్ ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. గతంలో 2015, 2018, 2022 సంవత్సరాల్లో విడుదలైన కానిస్టేబుల్ నోటిఫికేషన్లలో ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీ, గిరిజన యువతకు 75 శాతం రిజర్వేషన్లు అమలు చేశారని గుర్తుచేశారు. కానీ, 2026 నోటిఫికేషన్‌లో ఎందుకు అమలు చేయడం లేదని ఆమె ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ నిర్ణయంతో ఆసిఫాబాద్, నాగర్‌కర్నూల్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, ఆదిలాబాద్, మంచిర్యాల, వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోని గిరిజన యువత 400కు పైగా కానిస్టేబుల్ పోస్టులను కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. హోంమంత్రిత్వ శాఖను కూడా పర్యవేక్షిస్తున్న రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి, 2026 కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌లో అవసరమైన సవరణలు చేసి ఆదివాసీ, గిరిజన యువతకు పూర్తి న్యాయం చేయాలని కవిత డిమాండ్ చేశారు.

### తిరుమలలో సాధారణంగా భక్తుల రద్దీ.. సర్వదర్శనానికి 8 గంటలు

తిరుపతి: కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు తిరుమలకు వస్తున్న భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. టైమ్ స్లాట్ టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనానికి సుమారు 8 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 17 కంపార్ట్‌మెంట్లలో భక్తులు స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది. క్యూలైన్లలో, కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్న భక్తులకు అన్నప్రసాదం, తాగునీరు, పాలను అందిస్తోంది. నిన్న మొత్తం 83,322 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. వీరిలో 31,312 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. ఒక్కరోజే స్వామివారి హుండీ ఆదాయం రూ. 2.93 కోట్లుగా నమోదైంది.

# ఓట్ల చోరీతో అధికారం నిలబెట్టుకునే పన్నాగం

హైదరాబాద్: భాజపా ఉనికి ఉన్న రాష్ట్రాల్లో సర్ ద్వారా ఓట్లను తొలగించి అధికారాన్ని కైవసం చేసుకుంది. బెంగాల్, బిహార్, హరియాణా, మహారాష్ట్రల్లో భాజపా ప్రభుత్వాలు ఏర్పాటవడమే ఇందుకు ఉదాహరణ. సర్ అమలు చేయని, భాజపా ఉనికి లేని రాష్ట్రాల్లోనే ఇతర పార్టీలు విజయం సాధించాయి. 2014లో దేశంలో 81 కోట్ల ఓట్లు ఉండేవి. 2019లో 91 కోట్లకు, 2024లో 97 కోట్లకు పెరిగాయి. మరి 2029 ఎన్నికల నాటికి ఎన్ని ఉండాలి? సర్ పేరిట ఇప్పటికే 13 కోట్లు తొలగించారు. ఇంకో ఐదారు కోట్ల ఓట్లు తొలగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుత దేశ జనాభా 140 కోట్లు. సరాసరిగా 70–75% లెక్కేసుకుంటే 100 కోట్లకు పైగా ఓట్లు ఉండాలి. తొలగించినవి పోను 84 కోట్లే ఉన్నాయి. 81, 91, 97 కోట్ల ఓట్లు ఉన్నప్పుడు జనాభా ఎంత? 13 కోట్ల ఓట్లు తొలగించినప్పుడు జనాభా ఎంత? జనాభా పెరిగితే ఓట్లు పెరగాలి కదా? దీనికి ప్రధాని పార్లమెంట్‌లో సమాధానం చెప్పాల్సిందే. దేశ విభజన తర్వాత కోట్ల మంది ప్రజలు పాకిస్తాన్ నుంచి భారత్‌కు తరలివచ్చారు. వారందరికీ ఓటు హక్కు కల్పించి ఎన్నికలు నిర్వహించాలని నాటి ప్రధాని నెహ్రూ ఆలోచన. 1950 నాటి ఎన్నికల జాబితాల తయారీ ప్రక్రియలో... మీ తండ్రి, తాత ఎవరు, ఎక్కడ నుంచి వచ్చారని కొన్ని కాలమ్స్ పెట్టారు. ఇందిరాగాంధీ, వాజ్‌పేయీల హయాంలో.. లిస్ట్‌లో లేని వారికి ఓటు కల్పించడానికే సర్‌ను ఉపయోగించారు. 2014లో భాజపా వచ్చాక, అధికారాన్ని పదిలం చేసుకోవాలని... ప్రాంతాలు, భాషలు, జాతులు, మతాల మధ్య చిచ్చుపెట్టారు. తమను వ్యతిరేకించే వారి ఓట్లన్నీ తొలగించాలని కుట్ర పన్నారు. "భారత ఎన్నికల సంఘం తీసుకుంటున్న నిర్ణయాల్లో తప్పులు జరుగుతున్నాయని అందులోని ఇద్దరు సభ్యులే చెబుతున్నారు. అలాంటప్పుడు సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవడానికి ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షాలకు ఉన్న అభ్యంతరాలేంటి, ఆయన్ని ఎందుకు కాపాడుతున్నారు, మీతో కలిసి ఓట్లు తొలగించడమే ఇందుకు కారణం కాదా" అంటూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పిలుపుతో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో.. దిల్లీలో సోమవారం ఇండియా కూటమి చేపట్టిన 'మార్చ్ ఫర్ డెమోక్రసీ' ర్యాలీలో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ సహా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు సోమవారం దిల్లీకి తరలివచ్చారు. ర్యాలీకి ముందు.. పోరాట పంథాపై తెలంగాణభవన్‌లోని అంబేద్కర్ ఆడిటోరియంలో శ్రేణులకు రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "ఆనాడు భగత్‌సింగ్ నేతృత్వంలో సైమన్ గో బ్యాక్ నినాదమే దేశ స్వాతంత్ర్య పోరాటానికి దారులు వేసింది. నేడు రాహుల్‌గాంధీ నేతృత్వంలో జ్ఞానేశ్ గో బ్యాక్ నినాదమే భాజపా నుంచి దేశానికి విముక్తి కల్పిస్తుంది. దీన్నే మరో స్వాతంత్ర్య పోరాటస్థాయిలో ఉద్యమాన్ని కొనసాగిద్దాం. ఎన్నికల ప్రధాన అధికారిని.. ప్రధాని, ప్రధాన ప్రతిపక్షనేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కమిటీగా ఏర్పడి ఎన్నుకునేవారు. 2023లో మోదీ ప్రభుత్వం చట్టాన్ని సవరించి ఈ ఎన్నిక కమిటీలో సీజేఐని తొలగించి, కేంద్ర హోంశాఖ మంత్రిని తీసుకొచ్చింది. జ్ఞానేశ్‌కుమార్ వద్దని రాహుల్‌గాంధీ పూర్తిగా వ్యతిరేకించినా.. ప్రతిపక్షం గొంతు నొక్కుతూ ప్రధాని, హోంమంత్రి ఆయన్నే నియమించారు. వారిచ్చిన టాస్క్ ప్రకారమే.. బిహార్, బెంగాల్, హరియాణా, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్‌లలో ఆ పార్టీని వ్యతిరేకిస్తున్న దళితులు, ఆదివాసీలు, గిరిజనులు, మైనారిటీలు, యువత ఓట్లను జ్ఞానేశ్‌కుమార్ తీసేయించారు. సోషల్ మీడియాను ఏఐతో అనుసంధానించి.. భాజపాకు, మోదీకి వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్న వారి ఓట్లనూ తొలగిస్తున్నారు. ఈ కుట్రను మొదటిసారిగా బయటపెట్టింది రాహుల్‌గాంధీ. ఆయన నేతృత్వంలో భాజపా దురాగతాలను సమర్థంగా తిప్పికొడతాం" అని వివరించారు. ప్రజల మధ్య విభజన తేవాలనే కుట్ర.

# జంతర్‌మంతర్ బంద్.. రామ్‌లీలాలో గళం విప్పాలంటే రోజుకు రూ.1.21 లక్షలు!

ఢిల్లీ: ఢిల్లీలో నిరసన ప్రదర్శనలకు వేదిక మారింది. గతంలో జంతర్ మంతర్ వద్ద ఆందోళనలు నిర్వహించే వారు ఇప్పుడు ప్రత్యామ్నాయ ప్రదేశాలను ఆశ్రయించాల్సి వస్తోంది. అయితే కొత్తగా కేటాయించిన రామ్‌లీలా మైదాన్‌లో నిరసన చేపట్టాలంటే భారీ మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోంది. రోజుకు రూ.50 వేల అద్దెతో పాటు ఇతర చెల్లింపులు కలిపి తొలిరోజే రూ.1.21 లక్షల వరకు వెచ్చించాల్సి వస్తోంది. దీనికి తోడు ఈ ఏడాదిలో డిసెంబరు 29, 30, 31 తేదీలు మినహా మైదాన్ అందుబాటులో లేదని అధికారులు చెబుతున్నారు.

రోజుకు రూ.50 వేల అద్దె

ఢిల్లీలోని 12 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న రామ్‌లీలా మైదాన్‌లో సుమారు 50 వేల మంది పాల్గొనేలా కార్యక్రమాలు నిర్వహించవచ్చు. ఈ మైదాన్ బుకింగ్ కోసం రోజుకు రూ.50 వేలు చెల్లించాలి. అదనంగా రూ.55 వేల సెక్యూరిటీ డిపాజిట్ ఇవ్వాలి. ఇది తిరిగి చెల్లిస్తారు. పన్నులతో కలిపి ఒక్కరోజు బుకింగ్‌కు తొలుత రూ.1.21 లక్షల వరకు ఖర్చవుతుందని అధికారులు వెల్లడించారు. మైదాన్‌లో చిన్న ప్రాంతాన్ని ఉచిత నిరసనలకు కేటాయించినా.. అక్కడ కేవలం 150 మందికే అవకాశం ఉంది.

పోలీసుల అనుమతి తప్పనిసరి

ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యానవన విభాగం ద్వారా మైదాన్‌ను బుక్ చేసుకోవాలి. దరఖాస్తుకు ఢిల్లీ పోలీసుల నిరభ్యంతర పత్రం తప్పనిసరి. అక్టోబరు 11న జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం జంతర్ మంతర్‌ను నిరసన వేదికల జాబితా నుంచి తొలగించారు. దాని స్థానంలో రామ్‌లీలా మైదాన్, బురారీ మైదాన్, తూర్పు ఢిల్లీలోని సీబీడీ మైదాన్‌లను కేటాయించారు. ఈ మూడు ప్రాంతాల్లో నిరసనల నిర్వహణకు సంబంధించిన సమగ్ర మార్గదర్శకాలను ప్రత్యేకంగా విడుదల చేస్తామని పోలీసులు తెలిపారు.

### ట్రాఫిక్ సమస్యలూ తప్పవు

రామ్‌లీలా మైదాన్ రద్దీగా ఉండే వాణిజ్య ప్రాంతంలో ఉంది. సమీపంలో మూడు ఆసుపత్రులు, మున్సిపల్ సంస్థల ప్రధాన కార్యాలయాలు ఉన్నాయి. భారీ సభలు జరిగినప్పుడు చుట్టుపక్కల రహదారులపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతాయని అధికారులు చెబుతున్నారు. అసఫ్ అలీ రోడ్డులో వాహనాల రాకపోకలను వన్‌వైడ్‌గా మార్చడంతో పాటు ఇతర మార్గాల్లోనూ మళ్లింపులు చేపట్టాల్సి వస్తుంది. 2014లో ఇక్కడ జరిగిన బీజేపీ సభ కారణంగా దాదాపు నాలుగు కిలోమీటర్ల దూరంలోని ఐటీఓ వరకు ట్రాఫిక్ స్తంభించిందని ఓ అధికారి గుర్తుచేశారు.

### చరిత్రకు సాక్షిగా మైదాన్

ఒకప్పుడు చెరువుగా ఉన్న ఈ ప్రాంతాన్ని 1930 నాటికి చదును చేశారు. 1932 నుంచి ఇక్కడ రామ్‌లీలా వేడుకలు నిర్వహిస్తున్నారు. స్వాతంత్ర్యం తర్వాత శరణార్థులకు ఉపాధి కల్పించేలా 1951లో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేశారు. అనంతరం దేశ రాజకీయాల్లోనూ ఈ మైదాన్ కీలక వేదికగా నిలిచింది. 1975లో అత్యవసర పరిస్థితి ప్రకటించిన రోజున జయప్రకాశ్ నారాయణ్, అటల్ బిహారీ వాజ్‌పేయి ఇక్కడ సభలో ప్రసంగించారు. 2013లో అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఇక్కడే ప్రమాణ స్వీకారం చేశారు.

# నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలకు రిజర్వేషన్లు ఖరారు

అమరావతి : నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల ఎన్నికలకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. 17 నగరపాలక సంస్థల్లో మేయర్ పదవులను ఎస్టీ-1, ఎస్సీ-2, బీసీ-5, మహిళలు (జనరల్)-5, జనరల్ (అన్‌రిజర్వ్‌డ్)కు 4 కేటాయించారు. 106 పురపాలక సంఘాల్లో ఎస్టీ-3, ఎస్సీ-14, బీసీ-36, మహిళలు(జనరల్)-27, అన్ రిజర్వ్‌డ్‌కు 26 ఛైర్‌పర్సన్ పదవులు కేటాయిస్తూ సోమవారం పురపాలకశాఖ గెజిట్ విడుదల చేసింది. మొత్తం 123 నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల్లో.. బీసీలకు 41, ఎస్సీలకు 16, ఎస్టీలకు 4 స్థానాలు కేటాయించారు. 50 శాతం స్థానాల్లో మహిళలే గద్దెనెక్కనున్నారు. నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల్లో వార్డుల వారీ రిజర్వేషన్లు కూడా విడుదల చేశారు. కర్నూలు, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలను ఎస్సీలకు, మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ ఎస్టీకి దక్కాయి. మహా విశాఖపట్నం నగరపాలక సంస్థతో పాటు గుంటూరు, కడప, శ్రీకాకుళం, విజయనగరం కార్పొరేషన్లలో మహిళలే మేయర్లు కానున్నారు.

శ్రీకాకుళం, అనకాపల్లి జిల్లాల్లో మహిళలదే పైచేయి..

శ్రీకాకుళం జిల్లాలోని మూడు మున్సిపాలిటీలూ మహిళలకే దక్కాయి. పార్వతీపురం మన్యం జిల్లాలోని మూడు పురపాలక సంఘాల్లో రెండింట్లో బీసీ మహిళలకే అవకాశం లభించింది. అనకాపల్లి జిల్లాలోని నర్సీపట్నం, యలమంచిలి మున్సిపాలిటీలు రెండూ మహిళలకే దక్కాయి. బాపట్ల జిల్లాలోని మూడింటిలో రెండు మహిళలకే కేటాయించారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని 6 పురపాలక సంఘాల్లో నాలుగు చోట్ల మహిళలు ఛైర్‌పర్సన్లుగా ఎన్నికయ్యే అవకాశం లభించింది. వైఎస్సార్ కడప జిల్లాలో 8 పురపాలక సంఘాలు ఉండగా.. ఐదు మహిళలకు దక్కాయి. కర్నూలు జిల్లాలోని మూడు పురపాలక సంఘాల్లో రెండుచోట్ల మహిళలకు అవకాశం లభించింది. తూర్పుగోదావరి జిల్లాలోని మూడింటిలో రెండు మహిళలకే దక్కాయి. విజయనగరం జిల్లాలోని మూడు పురపాలక సంఘాల్లో మూడూ మహిళలకు లభించాయి.

కాకినాడ నగరపాలక సంస్థలో 2005 ఎన్నికల్లో బీసీ మహిళ, 2017 ఎన్నికల్లో జనరల్ మహిళలు మేయర్లుగా ఎన్నికయ్యారు. ఈసారి అక్కడి నుంచి బీసీ మహిళకు మేయర్‌గా ఎన్నికయ్యే అవకాశం లభించింది. కాకినాడ జిల్లాలోని మున్సిపాలిటీల్లో మూడు ఎస్సీలకు దక్కాయి. బాపట్ల జిల్లాలోని మూడింట రెండు ఎస్సీలకు లభించాయి. ప్రకాశం జిల్లాలోని నాలుగు పురపాలక సంఘాలూ జనరల్ అయ్యాయి. పల్నాడు జిల్లాలోని ఎనిమిదింటిలో నాలుగు జనరల్‌గా నిర్ణయించారు.

జిల్లాల వారీగా పురపాలక సంఘాల రిజర్వేషన్ల వివరాలు

మొత్తం 106: ఎస్టీ జనరల్ 2, ఎస్టీ మహిళ 1, ఎస్సీ జనరల్ 7, ఎస్సీ మహిళ 7, బీసీ జనరల్ 18, బీసీ మహిళ 18, జనరల్ మహిళ 27, జనరల్ (అన్ రిజర్వ్‌డ్) 26.

శ్రీకాకుళం: ఇచ్ఛాపురం (బీసీ మహిళ), పలాస-కాశీబుగ్గ (మహిళ జనరల్), ఆమదాలవలస (మహిళ జనరల్).

విజయనగరం: రాజాం (బీసీ మహిళ), నెల్లిమర్ల (బీసీ జనరల్), బొబ్బిలి (మహిళ జనరల్),

పార్వతీపురం మన్యం: పార్వతీపురం (మహిళ జనరల్), సాలూరు (బీసీ మహిళ), పాలకొండ (బీసీ మహిళ).

అనకాపల్లి: నర్సీపట్నం (బీసీ మహిళ), యలమంచిలి (మహిళ జనరల్).

తూర్పు గోదావరి: నిడదవోలు (ఎస్సీ మహిళ), కొవ్వూరు (మహిళ జనరల్), మండపేట (జనరల్).

కాకినాడ: ఏలేశ్వరం (ఎస్సీ మహిళ), సామర్లకోట (ఎస్సీ జనరల్), పిఠాపురం (ఎస్సీ జనరల్), తుని (బీసీ మహిళ), గొల్లప్రోలు (జనరల్), పెద్దాపురం (జనరల్).

బీఆర్ అంబేద్కర్ కోనసీమ: ముమ్మిడివరం (బీసీ మహిళ), రామచంద్రపురం (బీసీ జనరల్), అమలాపురం (జనరల్).

ఏలూరు: చింతలపూడి (ఎస్సీ మహిళ), నూజివీడు (ఎస్సీ జనరల్), జంగారెడ్డిగూడెం (బీసీ మహిళ).

పశ్చిమ గోదావరి: పాలకొల్లు (బీసీ మహిళ), నరసాపురం (మహిళ జనరల్), ఆకివీడు (మహిళ జనరల్), భీమవరం (మహిళ జనరల్), తణుకు (జనరల్), తాడేపల్లిగూడెం (జనరల్).

కృష్ణా: ఉయ్యూరు (ఎస్సీ జనరల్), గుడివాడ (బీసీ మహిళ), తాడిగడప (బీసీ జనరల్), పెడన (మహిళ జనరల్).

ఎన్టీఆర్: కొండపల్లి (ఎస్సీ మహిళ), తిరువూరు (బీసీ జనరల్), జగ్గయ్యపేట (మహిళ జనరల్), నందిగామ (జనరల్).

గుంటూరు: పొన్నూరు (మహిళ జనరల్), తెనాలి (జనరల్).

పల్నాడు: పిడుగురాళ్ల (బీసీ జనరల్), సత్తెనపల్లి (బీసీ జనరల్), చిలకలూరిపేట (మహిళ జనరల్), మాచర్ల (మహిళ జనరల్), గురజాల (జనరల్), దాచేపల్లి (జనరల్), వినుకొండ (జనరల్), నరసరావుపేట (జనరల్).

బాపట్ల: చీరాల (ఎస్సీ మహిళ), బాపట్ల (ఎస్సీ జనరల్), రేపల్లె (మహిళ జనరల్).

ప్రకాశం: కందుకూరు (జనరల్), చీమకుర్తి (జనరల్), అద్దంకి (జనరల్), దర్శి (జనరల్).

మార్కాపురం: పొదిలి (ఎస్సీ జనరల్), కనిగిరి (మహిళ జనరల్), గిద్దలూరు (జనరల్), మార్కాపురం (జనరల్).

నెల్లూరు: గూడూరు (ఎస్టీ మహిళ), అల్లూరు (ఎస్టీ జనరల్), బుచ్చిరెడ్డిపాళెం (మహిళ జనరల్), ఆత్మకూరు (మహిళ జనరల్), కావలి (జనరల్).

తిరుపతి: సూళ్లూరుపేట (ఎస్సీ మహిళ), పుత్తూరు (బీసీ జనరల్), శ్రీకాళహస్తి (బీసీ జనరల్), వెంకటగిరి (మహిళ జనరల్), నాయుడుపేట (మహిళ జనరల్).

చిత్తూరు: కుప్పం (ఎస్సీ జనరల్), పుంగనూరు (బీసీ మహిళ), పలమనేరు (మహిళ జనరల్), నగరి (జనరల్).

అన్నమయ్య: మదనపల్లె (బీసీ జనరల్), రాయచోటి (బీసీ జనరల్), బి.కొత్తకోట (బీసీ జనరల్).

వైఎస్సార్ కడప: యర్రగుంట్ల (బీసీ మహిళ), రాజంపేట (బీసీ మహిళ), కమలాపురం (మహిళ జనరల్), జమ్మలమడుగు (మహిళ జనరల్), పులివెందుల (మహిళ జనరల్), ప్రొద్దుటూరు (జనరల్), బద్వేలు (జనరల్), మైదుకూరు (జనరల్).

అనంతపురం: గుత్తి (ఎస్సీ మహిళ), గుంతకల్లు (బీసీ మహిళ), తాడిపత్రి (బీసీ జనరల్), కళ్యాణదుర్గం (మహిళ జనరల్), రాయదుర్గం (జనరల్)

శ్రీసత్యసాయి: కదిరి (బీసీ మహిళ), హిందూపురం (బీసీ జనరల్), మడకశిర (బీసీ జనరల్), పుట్టపర్తి (బీసీ జనరల్), పెనుకొండ (బీసీ జనరల్), ధర్మవరం (జనరల్).

నంద్యాల: ఆత్మకూరు (ఎస్టీ జనరల్), ఆళ్లగడ్డ (బీసీ మహిళ), నందికొట్కూరు (బీసీ మహిళ), బేతంచెర్ల (బీసీ జనరల్), నంద్యాల (బీసీ జనరల్), డోన్ (మహిళ జనరల్).

కర్నూలు: గూడూరు (బీసీ మహిళ), ఆదోని (మహిళ జనరల్), ఎమ్మిగనూరు (జనరల్).

ఈ జిల్లాల్లో బీసీలదే ఆధిపత్యం

అన్నమయ్య జిల్లాలో మదనపల్లె, రాయచోటి, బి.కొత్తకోట పురపాలక సంఘాలు ఉండగా.. అన్ని చోట్లా బీసీలకు అవకాశం దక్కింది. పార్వతీపురం మన్యం జిల్లాలో మూడు పురపాలక సంఘాల్లోనూ మహిళలే ఛైర్‌పర్సన్లు కానున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని ఆరు పురపాలక సంఘాల్లో 5 చోట్ల బీసీలకు పీఠం ఖరారైంది. ధర్మవరం అన్ రిజర్వ్‌డ్ అయింది. నంద్యాల జిల్లాలోని ఆరు పురపాలక సంఘాల్లో నాలుగు చోట్ల బీసీలు ఛైర్‌పర్సన్లుగా ఎన్నికయ్యే అవకాశం దక్కింది. బీఆర్ అంబేద్కర్ జిల్లా కోనసీమలోని మూడు పురపాలక సంఘాల్లో రెండు చోట్ల బీసీలకు అవకాశం లభించింది.

### 17 నగరపాలక సంస్థల్లో మేయర్ రిజర్వేషన్లు

శ్రీకాకుళం: మహిళ (జనరల్); విజయనగరం: మహిళ (జనరల్); విశాఖపట్నం: మహిళ (జనరల్); రాజమహేంద్రవరం: ఎస్సీ (జనరల్); కాకినాడ: బీసీ మహిళ; ఏలూరు: బీసీ (జనరల్); మచిలీపట్నం: బీసీ మహిళ; మంగళగిరి-తాడేపల్లి: ఎస్టీ (జనరల్); గుంటూరు: మహిళ (జనరల్); విజయవాడ: జనరల్; ఒంగోలు: జనరల్; నెల్లూరు: జనరల్; తిరుపతి: జనరల్; చిత్తూరు: బీసీ (జనరల్); అనంతపురం: బీసీ (జనరల్); కడప: మహిళ (జనరల్); కర్నూలు: ఎస్సీ మహిళ

మొత్తం 17: ఎస్టీ 1, ఎస్సీ జనరల్ 1, ఎస్సీ మహిళ 1, బీసీ మహిళ 2, బీసీ జనరల్ 3, మహిళ జనరల్ 5, జనరల్ (అన్ రిజర్వ్‌డ్) 4.

# హాస్టళ్లకు సరుకుల సరఫరా స్థానిక వెండర్లకే ఇవ్వాలి: హరీశ్ రావు

హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
మహా న్యూస్
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక



## ఎన్నిక కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని చలో ఢిల్లీ

### - కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన ఛలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ ,రాష్ట్ర మంత్రులు,సహచర ఎమ్మెల్యేలు,జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులతో కలిసి పరిగి ఎమ్మెల్యే,టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

## రైతులకు ఉచితంగా వేరుశనగ విత్తనాల పంపిణీ

వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కుల్కచర్ల మండల కేంద్రంలో అర్హులైన రైతులకు 100 శాతం సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, పిఏసిఎస్ చైర్మన్ భీమ్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోపాల్ నాయక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుల అభ్యున్నతి కి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరంగా కృషి చేస్తుందన్నారు. రైతుల సంక్షేమం కోసం సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. రైతులను రాజు చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు సత్యమ్మ వెంకటేష్, రాంపల్లి వెంకటయ్య, తిరుపతయ్య, రవి నాయక్, కిష్టయ్య, శ్రీను, డైరెక్టర్ భరత్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## చిగురాలపల్లిలో పందిరి కూరగాయల సాగును పరిశీలించిన

### - ఉద్యానశాఖ సంచాలకులు శ్రీమతి యాస్మిన్ బాష

వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): తెలంగాణ రాష్ట్ర ఉద్యానశాఖ సంచాలకులు శ్రీమతి యాస్మిన్ బాష ఈ రోజు వికారాబాద్ జిల్లా చిగురాలపల్లి గ్రామంలో రైతు శ్రీ ఖాజా పాషా సాగు చేస్తున్న ఒక ఎకరా బీర పందిరి సాగును సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎం.ఏ. సత్తార్, స్థానిక ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, ఉద్యానశాఖ అధికారి సురేంద్రనాథ్, హెచ్ ఈ ఓరంరెడ్డి, బాబ్య నాయక్ ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతుతో ముఖాముఖి మాట్లాడిన సంచాలకులు పంట సాగు విధానం, పెట్టుబడి వ్యయం, దిగుబడి, మార్కెట్లో లభిస్తున్న ధరలు, రైతుకు వస్తున్న ఆదాయం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఆసక్తి కలిగిన రైతులు తక్కువ కాలంలో దిగుబడి సాధించి, మార్కెట్‌లో మంచి ధరలు లభించే పందిరి కూరగాయల సాగును చేపట్టి అధిక ఆదాయం పొందేందుకు కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకొని రైతులు ఆయిల్‌పామ్ సాగు చేపట్టాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం, వర్షపాతంలో అనిశ్చిత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ, తక్కువ నీటితో సాగు చేయగల కూరగాయలు మరియు పప్పుదినుసుల పంటలపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ క్షేత్ర సందర్శన ద్వారా పందిరి కూరగాయల సాగులో ఉన్న అవకాశాలు, ఆధునిక సాగు పద్ధతులు, రైతులకు లభించే ఆదాయ మార్గాలపై అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దిన్నెదేవరపాడులో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

### రెండు బెల్ట్ షాపులు సీజ్ నంబర్ ప్లేట్లు లేని 10 మోటార్ సైకిళ్లు స్వాధీనం





కర్నూలు, అక్టోబర్ 13: (మహి న్యూస్): కర్నూలు జిల్లా దిన్నెదేవరపాడు గ్రామంలోని అంబేద్కర్ నగర్‌లో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు తాలూకా సీఐ తేజమూర్తి ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో రెండు బెల్ట్ షాపులను సీజ్ చేశారు. నంబర్ ప్లేట్లు లేని 10 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## ఇంద్రకీలాద్రిలో దుర్గమ్మను దర్శించుకున్న సీఎం విజయ్

విజయవాడ: తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు ఇంద్రకీలాద్రిలో అమ్మవారిని దర్శించుకున్నారు. అంతకుముందు విజయ్‌కు ఆలయ మర్యాదలతో దేవాదాయ శాఖ అధికారులు, దుర్గగుడి అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. దుర్గమ్మ సన్నిధిలో విజయ్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ముఖ్యమంత్రిగా విజయ్ బాధ్యతలు స్వీకరించాక ఆయన ఆంధ్రప్రదేశ్‌కు రావడం ఇదే మొదటిసారి. కాగా, విజయ్ చెన్నై నుంచి విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకి చేరుకున్నారు. అక్కడి నుంచి విజయ్ నేరుగా ఇంద్రకీలాద్రి చేరుకున్నారు. విజయ్ పున్నమి ఘాట్‌లో జరుగుతున్న విజయవాడ ఉత్సవ్ 2.0లోనూ పాల్గొననున్నారు. మంగళవారం రాత్రి 9 గంటలకు ఆయన చెన్నై వెళ్తారు.

## పిటిషన్ వేయడం కూడా రాదా? రాహుల్‌పై విమర్శలు

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో సరిగ్గా పిటిషన్ వేయడం సైతం లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి రావడం లేదని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ విమర్శించారు. నిన్న ఎస్ఐఆర్‌పై విపక్షాలు వేసిన పిటిషన్‌లో 14 లోపాలు రిజిస్ట్రీ గుర్తించిందన్నారు. మంగళవారం ఢిల్లీలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. ఈనీకి వ్యతిరేకంగా సరైన ఆధారాలుంటే కోర్టుకు ఎందుకు సమర్పించలేదన్నారు. మీరు గెలిచిన రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ సక్రమమా ఓడిన చోట అక్రమమా అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ దేశంలో అరాచకం సృష్టించాలని చూస్తున్నారు. అసత్యాలతో రాజకీయం చేసే యత్నం చేస్తున్నారన్నారని పీయూష్ గోయల్ విమర్శించారు. కాగా ఢిల్లీలో ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, సర్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనలపై దాఖలైన పిటిషన్ల విచారణ వాయిదా పడింది. ఈ నిరసనల సందర్భంగా పోలీసుల చర్యలు, రాజకీయ నాయకులు, న్యాయవాదులు, జర్నలిస్టుల నిర్బంధం, ప్రజా రవాణాపై ఆంక్షలు తదితర అంశాలపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై స్పందన తెలియజేస్తూ నివేదికలు, కౌంటర్లు దాఖలు చేసేందుకు కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా గడువు కోరింది. అయితే అందుకు న్యాయస్థానం అంగీకరించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ పిటిషన్లను విచారించాల్సి ఉంది. అయితే జస్టిస్ మోహన అనారోగ్యానికి గురికావడంతో విచారణను అక్టోబర్ 15కు వాయిదా వేయాలని సీజేఐ బెంచ్ భావించింది. ఈ లోపు కేంద్రం గడువు కోరడంతో.. వాయిదాకు ఇరుపక్షాల న్యాయవాదులు అభ్యంతరం వ్యక్తం చేయలేదు.

# ఘనంగా కుడిపూడి శివన్నారాయణ జన్మదిన వేడుకలు

## స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి.

### జనసేన నాయకుడు కుడిపూడి శివన్నారాయణ పిలుపు

తాళ్లరేవు, మహి న్యూస్, అక్టోబర్ 13: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పి. మల్లవరం గ్రామంలోని పత్తికొండు కళ్యాణ మండపంలో ముమ్మిడివరం నియోజకవర్గ మాజీ ఏఎంసీ చైర్మన్, జనసేన పార్టీ నాయకుడు కుడిపూడి శివన్నారాయణ జన్మదిన వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముమ్మిడివరం నియోజకవర్గ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు), కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు కుడిపూడి శివన్నారాయణకు శాలువా కప్పి ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముమ్మిడివరం నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన కూటమి నాయకులు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తమ అభిమాన నాయకుడికి



పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తల రాకతో పత్తికొండు కళ్యాణ మండపం సందడిగా మారింది. జన్మదిన వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి.

### కూటమి ప్రభుత్వ లక్ష్యం సంక్షేమం, అభివృద్ధి

ఈ సందర్భంగా జనసేన నాయకుడు కుడిపూడి శివన్నారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని ప్రధాన ధ్యేయంగా పెట్టుకొని ముందుకు సాగుతోందని అన్నారు. ప్రజలకు మెరుగైన పాలన అందించడం, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చూడటం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తూ ప్రజలకు చేరువైన పాలన అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి సంబంధిత ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ పట్ల ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు.

### స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా ముందుకు సాగాలి

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని కుడిపూడి శివన్నారాయణ పిలుపునిచ్చారు. ఎన్నికల్లో విజయాన్ని సాధించాలంటే ఇప్పటి నుంచే గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. కూటమిలోని భాగస్వామ్య పార్టీల నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో ముందుకు సాగుతూ ప్రజలతో నిరంతరం మమేకం కావాలని అన్నారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ లక్ష్యాలు, ప్రజల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను ప్రతి గ్రామంలో విస్తృతంగా వివరించాలని పేర్కొన్నారు. నాయకుల మధ్య సమన్వయం, కార్యకర్తల ఐక్యత, ప్రజలతో సత్సంబంధాలు పార్టీ విజయానికి కీలకమని తెలిపారు. వ్యక్తిగత అభిప్రాయాలకు తావివ్వకుండా పార్టీ ప్రయోజనాలు, కూటమి ఐక్యతకు

ప్రాధాన్యతనిస్తూ పనిచేయాలని సూచించారు. గ్రామస్థాయిలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసి రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయపతాకం ఎగురవేసేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.

### కార్యకర్తలే పార్టీకి బలం

పార్టీ బలోపేతంలో కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని కుడిపూడి శివన్నారాయణ పేర్కొన్నారు. ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవడం, వాటి పరిష్కారానికి కృషి చేయడం ద్వారా ప్రజల ఆదరణ పొందవచ్చని అన్నారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభించేలా నాయకులు ప్రోత్సహించాలని సూచించారు. కూటమి ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని తెలిపారు. ఈ జన్మదిన వేడుకలు కేవలం వ్యక్తిగత వేడుకలకే పరిమితం కాకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలు పరస్పరం కలుసుకొని భవిష్యత్తు రాజకీయ కార్యాచరణపై ఉత్సాహాన్ని పంచుకునే వేదికగా నిలిచాయి. నాయకులు, కార్యకర్తలు ఒకే వేదికపైకి చేరడంతో పార్టీ శ్రేణుల్లో సందడి నెలకొంది.

### భారీగా తరలివచ్చిన నాయకులు, అభిమానులు

ముమ్మిడివరం నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన కూటమి నాయకులు, జనసేన పార్టీ కార్యకర్తలు, కుడిపూడి శివన్నారాయణ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పలువురు నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యకర్తలు, అభిమానుల మధ్య కుడిపూడి శివన్నారాయణ జన్మదిన వేడుకలు ఘనంగా ముగిశాయి. పత్తికొండు కళ్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమం జనసేన శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కూటమి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగాలన్న సందేశంతో ఈ వేడుకలు ముగిశాయి.

## అక్టోబర్ 14న శ్రీ దుర్గమ్మవారిని దర్శించుకోనున్న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

విజయవాడ, మహి న్యూస్, అక్టోబర్ 13: రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం, దేవాదాయ శాఖ అధికారులు పటిష్టమైన అన్ని ఏర్పాట్లు చేపట్టనున్నట్లు దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ తెలిపారు మంగళవారం ఇంద్రకీలాద్రి మీడియా పార్టీ వద్ద దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ మాట్లాడుతూ విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో నిర్వహిస్తున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయని తెలిపారు. అక్టోబర్ 11వ తేదీన ఘనంగా ప్రారంభమైన ఉత్సవాలు భక్తుల విశేష రద్దీ నడుమ విజయవంతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

### భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు

దసరా మహోత్సవాలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో, భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు దేవస్థానం, జిల్లా యంత్రాంగం సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ వెల్లడించారు. ఉత్సవాలు సజావుగా కొనసాగేందుకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

### అక్టోబర్ 14న ఇంద్రకీలాద్రికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

దసరా శరన్నవరాత్రి మహోత్సవాల నాలుగో రోజైన అక్టోబర్ 14వ తేదీన భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గమ్మవారిని దర్శించుకోనున్నారని దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ తెలిపారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నట్లు వివరించారు.

### అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్న రాష్ట్రపతి

అక్టోబర్ 14వ తేదీ సాయంత్రం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. రాష్ట్రపతి పర్యటనను దృష్టిలో ఉంచుకుని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని, పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని సూచించినట్లు కమిషనర్ తెలిపారు.

### రాష్ట్రపతి పర్యటనకు సమన్వయంతో ఏర్పాట్లు

రాష్ట్రపతి పర్యటనకు సంబంధించిన అధికారిక సమాచారం, ఏర్పాట్ల వివరాలను దేవాదాయ శాఖ కమిషనర్ ఈ సందర్భంగా వెల్లడించారు. పర్యటన ప్రశాంతంగా, సజావుగా జరిగేలా సంబంధిత అధికారుల సమన్వయంతో అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను విజయవంతంగా నిర్వహించడంతో పాటు, అమ్మవారి దర్శనానికి విచ్చేసే ప్రతి భక్తుడికి సౌకర్యవంతమైన దర్శన అనుభవాన్ని కల్పించడమే లక్ష్యంగా దేవస్థానం, జిల్లా యంత్రాంగం కృషి చేస్తున్నాయని కమిషనర్ పేర్కొన్నారు. సమావేశంలో సమాచార శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ టి. తిమ్మప్ప, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ త్రినాథ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 17 వరకు సౌదీకి ఇండిగో విమానాలు రద్దు

రియాద్: సౌదీ అరేబియాలో మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో విమానయాన సంస్థ ఇండిగో కీలక నిర్ణయం తీసుకుంది. రియాద్, జెద్దా, దమ్మామ్, మదీనా నగరాలకు వెళ్లే విమానాలను, అక్కడి నుంచి వచ్చే అన్ని విమానాలను కూడా అక్టోబర్ 17 వరకు రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. "ప్రయాణికులు విమానాశ్రయానికి బయలుదేరే ముందు ఇండిగో వెబ్‌సైట్‌లో తమ విమాన సర్వీసుల స్థితిని తనిఖీ చేసుకోవాలని సూచించింది. బుకింగ్ సమయంలో అందించిన సంప్రదింపు వివరాలకు ఎప్పటికప్పుడు సమాచారం పంపిస్తున్నట్లు సంస్థ తెలిపింది. ప్రయాణికులకు ఏవైనా సందేహాలు ఉంటే సహాయం చేయడానికి మా సహాయక బృందాలు అందుబాటులో ఉంటాయి," అని ఇండిగో తెలిపింది. "మీ భద్రత, క్షేమమే మాకు అత్యంత ప్రాధాన్యత. సురక్షితమైన కార్యకలాపాలను నిర్వహించడానికి మేము సంబంధిత అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటున్నాము," అని ఇండిగో తన ప్రకటనలో పేర్కొంది. సోమవారం రాత్రి, రియాద్ వైపు హౌతీలు ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణిని తాము అడ్డుకుని ధ్వంసం చేశామని సౌదీ అరేబియా ప్రకటించిన కొద్దిసేపటికే, తాము బాలిస్టిక్ క్షిపణితో విమానాశ్రయంపై దాడి చేశామని హౌతీలు తెలిపారు. యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారుల దాడుల నేపథ్యంలో రియాద్‌లోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని కూడా అధికారులు శనివారం వరకు మూసివేశారు. విమానాశ్రయ సౌకర్యాల భద్రతను నిర్ధారించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సౌదీ పౌర విమానయాన సంస్థ వెల్లడించింది.ు

## జంతర్ మంతర్ క్లోజ్.. సుప్రీంలో సవాల్




ఢిల్లీ : ఢిల్లీ జంతర్ మంతర్ వేదికగా ఆందోళనల రద్దును సవాలు చేస్తూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. జంతర్ మంతర్‌ను నిరసన స్థలంగా డీనోటిఫై చేస్తూ ఢిల్లీ పోలీసుల నిర్ణయాన్ని సవాల్ చేస్తూ పిటిషన్ వేశారు. అక్టోబర్ 11న ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్ జారీ చేసిన స్టాండింగ్ ఆర్డర్‌పై అభ్యంతరం వ్యక్తమవుతోంది. జంతర్ మంతర్ స్థానంలో మూడు కొత్త నిరసన వేదికలను ఢిల్లీ పోలీసులు ప్రకటించారు. రాంలీలా మైదాన్, బురారీ మైదాన్, తూర్పు ఢిల్లీలోని సీబీడీ గ్రౌండ్‌ను నిరసన స్థలాలుగా గుర్తించారు. ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞాన్‌శ్ కుమార్‌కు వ్యతిరేకంగా నిరసనల నేపథ్యంలో పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఢిల్లీలో నిరసనలపై పోలీసుల అణచివేత చర్యల మధ్య కొత్త నిరసన వేదికలపై వివాదం నెలకొంది. గతంలో జంతర్ మంతర్‌ను నిరసనల వేదికగా సుప్రీంకోర్టు గుర్తించిన విషయాన్ని పిటిషన్‌లో ప్రస్తావించారు. నిరసనలకు అనువైన స్థలం కాదంటూ గతంలో రాంలీలా మైదాన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. కొత్తగా గుర్తించిన నిరసన స్థలాలు ఢిల్లీ చెత్త డంపింగ్ యార్డులకు సమీపంలో ఉన్నాయంటూ అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఢిల్లీలో నిరసనలపై దాఖలైన పెండింగ్ పిటిషన్‌లో భాగంగా సుప్రీంకోర్టును పిటిషనర్ ఆశ్రయించారు. పిటిషనర్ తరఫున మాజీ ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ముక్తా గుప్తా వాదనలు వినిపించే అవకాశం ఉంది.

## 4 రోజులపాటు ఏపీకి వర్ష సూచన

**విశాఖపట్నం: బంగాళాఖాతంలో మంగళవారం అల్ప పీడనం ఏర్పడే అవకాశం ఉందని, దాని ప్రభావంతో వచ్చే 4 రోజులు రాష్ట్రంలో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో ద్రోణి ప్రభావంతో కోస్తా అంతటా 15వ తేదీ నుంచి భారీ వర్షాలు ఉండే అవకాశం ఉంది. గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. బుధవారం కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది.**

RNI : APTEL/25/A0108
మహి న్యూస్
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక



## ఈనెల 14, 15 తేదీల్లో పెన్షన్, జీపీఎఫ్ అదాలత్

### 14న డీడీవోలకు వర్క్‌షాప్.. 15న పెన్షనర్ల సమస్యలపై సమావేశం



అనంతపురం, అక్టోబర్ 13: (మహి న్యూస్): పెన్షన్, జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) సమస్యల పరిష్కారం కోసం ఈనెల 14, 15 తేదీల్లో అనంతపురంలో పెన్షన్, జీపీఎఫ్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (అకౌంట్స్ అండ్ ఎంటైటిల్మెంట్స్) ఎస్. శాంతిప్రియ తెలిపారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అక్టోబర్ 14న రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రాసెసింగ్ సిస్టమ్ (ఆర్‌బీపీఎస్), పెన్షన్ కేసులు, జీపీఎఫ్ కేసులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే విధానంపై డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్లకు (డీడీవోలు) వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 15న పెన్షనర్లకు సంబంధించిన అంశాలపై సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. పెన్షన్, జీపీఎఫ్, పదవీ విరమణ ప్రయోజనాలకు సంబంధించిన సమస్యలపై తక్షణ మార్గదర్శకత్వం అందించడం, ఫిర్యాదులను పరిష్కరించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయాన్ని పెంచి, డిజిటల్ విధానాల ద్వారా పదవీ విరమణ ప్రయోజనాలను సకాలంలో అందించేందుకు ఈ అదాలత్ దోహదపడుతుందని వివరించారు. ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్‌తో పాటు సీనియర్ అధికారులు పెన్షనర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, డీడీవోలు, పెన్షన్ మంజూరు చేసే అధికారులు (పీఎస్ఏలు)తో నేరుగా మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, డీడీవోలు, పీఎస్ఏలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పారదర్శకమైన, వేగవంతమైన పెన్షన్ సేవలు పొందాలని ఎస్. శాంతిప్రియ విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి 8 వీల్‌చైర్లు మంజూరు

### విభిన్న ప్రతిభావంతుల విజ్ఞప్తిపై స్పందించిన కలెక్టర్ ఓ. ఆనంద్

అనంతపురం, అక్టోబర్ 13: (మహి న్యూస్): అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వీల్‌చైర్ల కొరత ఉందని విభిన్న ప్రతిభావంతులు చేసిన విజ్ఞప్తిపై జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ స్పందించారు. ఆసుపత్రికి వెంటనే 8 వీల్‌చైర్లు మంజూరు చేసి, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ద్వారా అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుల కార్యాలయం ద్వారా వీల్‌చైర్లను ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి అందజేశారు. వీటి ద్వారా ఆసుపత్రికి వచ్చే రోగులకు, ముఖ్యంగా నడవలేని వారికి రాకపోకల్లో ఇబ్బందులు తగ్గనున్నాయి. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. మల్లేశ్వరి, ఆర్ఎంఓ డా. హేమలత, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకురాలు జి. అర్చన, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## సీఐఐ భాగస్వామ్య సదస్సుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

### అక్టోబర్ 23న అనంతపురం జేఎన్టీయూలో ప్రాంతీయ సదస్సు ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ఓ. ఆనంద్

అనంతపురం, అక్టోబర్ 13: (మహి న్యూస్): అనంతపురం జిల్లా కేంద్రంలోని జేఎన్టీయూలో అక్టోబర్ 23న నిర్వహించనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు--2026 ప్రాంతీయ సమావేశానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక అభివృద్ధి మండలి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ సదస్సు ఏర్పాట్లను మంగళవారం కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్ సుయశ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. జేఎన్టీయూలోని ఎన్టీఆర్ ఆడిటోరియం, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, అతిథి గృహంలో ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సదస్సుకు హాజరయ్యే ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతి, భోజనం, సౌండ్ సిస్టమ్, ప్రత్యక్ష ప్రసారం, లైటింగ్, పోలీసు భద్రత వంటి ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. అలాగే బ్యాక్‌డ్రాప్, షామియానాలు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రదర్శన, అవసరమైన

సామగ్రి తదితర ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఈ ప్రాంతీయ సదస్సులో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పరిశ్రమల శాఖ, ఏపీఐఐసీ, ఇతర సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాస యాదవ్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నాగకుమార్, పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి, డీఐపీఆర్వో బాల కొండయ్య, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## టెన్త్ ఇంటర్ టాపర్లకు

## సిటిజన్ కో-ఆపరేటీవ్ సొసైటీ బ్యాంకు ప్రోత్సాహం

### 11 మంది విద్యార్థినీ విద్యార్థులకు రూ.10 వేలు చొప్పున అందజేత

యానాం, మహి న్యూస్, అక్టోబర్ 13: మెరుగైన సేవలతో ఖాతాదారులకు విశేష సేవలందిస్తున్న సిటిజన్ కోపరేటివ్ సొసైటీ బ్యాంకు, ఖాతాదారుల పిల్లలకు విద్యా ప్రోత్సహకాలను అందించడం అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం స్థానిక బ్యాంకులో జరిగిన కార్యక్రమంలో టెన్త్, ఇంటర్మీడియట్ లో 95 శాతం పైబడి మార్కులు సాధించిన ఆ బ్యాంకు ఖాతాదారుల పిల్లలకు రూ పదివేల చొప్పున చెక్కులు, ప్రశంసా పత్రాలను బ్యాంకు మేనేజర్ కాశి అశోక్ కుమార్ సమక్షంలో జనమిత్ర సంపాదకులు, కళైమామిణి అవార్డు గ్రహీత పొనుగుమట్ల విష్ణుమూర్తి, ఆర్.ఐ.టి. కళాశాల రిటైర్డ్ డీన్ అన్యం రామకృష్ణారావు లు అందజేశారు. అందుకున్న వారిలో బొడ్డు యశస్వి రత్న ప్రహర్షిణి, మలసాని యోగామృత, నాగసూరి జనశ్రీ, పుల్లేటి లక్ష్మీ సుధీప్తి, బిల్లకుర్తి రూపాశ్రీ, బత్తుల ముదిత, పుప్పాల నేహ అశేష శ్రీ విష్ణుతి, యాళ్లపు హరితశ్రీ, దోనిపూడి జీవనచంద్ర కార్తీక్ వర్మ, అద్దాల గాయత్రీ, రెడ్డి పావని సత్య సాయిశ్రీ లు ఉన్నారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ కాశి అశోక్ కుమార్ మాట్లాడుతూ 2025-26 విద్యా



సంవత్సరానికి గాను యానాంలో 11 మందికి అలాగే 46 బ్రాంచిలలో మొత్తంగా 292 మంది విద్యార్థులకు చెక్కులు అందించడం జరిగిందన్నారు. గత 28 ఏళ్ళుగా ప్రతీ సంవత్సరం అందించి విద్యార్థులను ప్రోత్సాహిస్తున్నట్లు తెలిపారు. ఖాతా దారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. పొనుగుమట్ల విష్ణుమూర్తి మాట్లాడుతూ అత్యధిక మార్కులు సాధించిన ఖాతాదారుల పిల్లలకు ప్రోత్సాహకాలు అందించడం గొప్ప విషయం అన్నారు. సిటిజన్ కో ఆపరేటీవ్ సొసైటీ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయం అన్నారు. డీన్ రామకృష్ణారావు, తలాటం ప్రకాశరావు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీవారి వాహనసేవలో భక్తి పరిమళాలు.. జానపద కళల సందళ్లు

### తొమ్మిది రాష్ట్రాల నుంచి 17 కళాబృందాలు..

### 489 మంది కళాకారుల ప్రదర్శనలు

తిరుమల మహిన్యూస్ అక్టోబర్ 13.: తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన మంగళవారం ఉదయం శ్రీ మలయప్పస్వామివారు చిన్నశేష వాహనంపై తిరుమాడ వీధుల్లో వైభవంగా విహరిస్తూ భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. గోవింద నామస్మరణలు, మంగళవాయిద్యాలు, భక్తిగీతాల నడుమ సాగిన

వాహనసేవ భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తొమ్మిది రాష్ట్రాలకు చెందిన 17 కళాబృందాల్లోని 489 మంది కళాకారులు తమ ప్రాంతీయ సంప్రదాయ కళారూపాలను ప్రదర్శించి భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు.

**ఆకట్టుకున్న సంప్రదాయ జానపద కళారూపాలు**

**తప్పెటగుళ్ల నృత్యం:**

ఉత్తరాంధ్రకు ప్రత్యేకమైన తప్పెటగుళ్ల నృత్యం లయబద్ధమైన అడుగులు, తప్పెట వాయిద్యాల ధ్వనులతో అలరించింది. ఈ ప్రదర్శన ఉత్తరాంధ్ర సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని

చాటిచెప్పింది.

**థింసా నృత్యం:**

అరకులోయ గిరిజన ప్రాంతానికి చెందిన థింసా నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భుజాలపై చేతులు వేసుకుని వృత్తాకారంలో లయబద్ధంగా నృత్యం చేసిన గిరిజన కళాకారులు తమ ఐక్యతను, ఆనందోత్సాహాలను ప్రతిబింబించారు.

**కురత్తి నృత్యం:**

తమిళనాడుకు చెందిన కురత్తి నృత్యం జానపద కథలు, హావభావాలు, సంభాషణలతో తమిళ సంప్రదాయ కళావైభవాన్ని ఆవిష్కరించింది.

**కర్ణాటక జానపద కళలు:**

ఉడిపి, దక్షిణ కన్నడ ప్రాంతాలకు చెందిన కళాకారులు పాటలు, నృత్యాల సమ్మేళనంతో తమ ప్రాంతీయ జానపద సంప్రదాయాలను ప్రదర్శించి భక్తులను అలరించారు.

**భక్తి.. సంస్కృతి.. భారతీయ కళావైభవం**

శ్రీవారి వాహనసేవలో వివిధ రాష్ట్రాల కళాకారులు తమ సంప్రదాయ కళారూపాలను ప్రదర్శించడం ద్వారా భారతీయ సంస్కృతిలోని వైవిధ్యం, ఐక్యత, భక్తి సంప్రదాయాల గొప్పతనం ప్రతిబింబించాయి. స్వామివారి సేవలో కళలను ప్రదర్శించడం కళాకారులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందించగా, భక్తులకు కనులవిందైన సాంస్కృతిక వేదుకగా నిలిచింది.

## బీజేపీలో చేరిన సుంకరపాలెం మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు

### అమలాపురం జిల్లా పార్టీ కార్యాలయంలో ఘనంగా ఆహ్వానం

తాళ్లరేవు, మహి న్యూస్, అక్టోబర్ 13: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం సుంకరపాలెం గ్రామానికి చెందిన మాజీ సొసైటీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ తిల్లపూడి నాగేశ్వరరావు భారతీయ జనతా పార్టీలో చేరారు. మంగళవారం అమలాపురంలోని జిల్లా

బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకుల సమక్షంలో ఆయన కాషాయ కండువా కప్పుకున్నారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాలగ్రామ లక్ష్మీ ప్రసన్న, జిల్లా ఇన్‌ఛార్జి కారంకి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ తిల్లపూడి నాగేశ్వరరావుకు పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన చేరికతో సుంకరపాలెం ప్రాంతంలో బీజేపీ బలోపేతానికి మరింత అవకాశం ఏర్పడుతుందని పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

## రూ.1.70 కోట్లతో మంచినీటి ట్యాంకుల నిర్మాణం

### ఇంజరం, లచ్చిపాలెంలో ఓవర్‌హెడ్ ట్యాంకులు ప్రారంభించిన ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు

తాళ్లరేవు, మహి న్యూస్, అక్టోబర్ 13: తాళ్లరేవు మండల పరిధిలోని ఇంజరం, లచ్చిపాలెం గ్రామ పంచాయతీల్లో సుమారు రూ.1.70 కోట్ల వ్యయంతో నిర్మించిన రెండు మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంకులను ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆయా గ్రామాలకు చేరుకున్న ఎమ్మెల్యేకు కూటమి నాయకులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం నూతనంగా నిర్మించిన ట్యాంకులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని నిరంతరం అందించాలనే లక్ష్యంతో కోట్లాది రూపాయల నిధులతో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నామని, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ధూళిపూడి వెంకటరమణ, మండల సాగునీటి సంఘం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వేగేశ్న భాస్కర్ రాజు, శెట్టిబలిజ కార్పొరేషన్ ప్రతినిధి టేకుమూడి లక్ష్మణరావు, ముమ్మిడివరం మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆకెళ్ల నాగేశ్వరరావు, గ్రామ కమిటీ అధ్యక్షులు కొండేపూడి నూకరాజు, కాట్రు వీరేశ్వరరావు, స్థానిక నాయకులు కావూరి శ్రీనివాస్, రేలంగి శ్రీకాంత్, చేదురి అరవింద్ బాబు, శీలం అంజి, మోర్తా భైరవస్వామి, దడాల సువర్ణలత, పంపన శ్రీనివాస్, దొమ్మేటి కోటేశ్వరరావు, గుత్తుల నూకరాజు, పంపన రామనారాయణ, కూటమి నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## యానం బైపాస్‌లో ఇష్టారాజ్యంగా పార్కింగ్..

# ప్రమాదాలకు ఆహ్వానం!

### నో పార్కింగ్ ఉల్లంఘనలపై ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యమంటూ స్థానికుల ఆగ్రహం

యానం, మహి న్యూస్, అక్టోబర్ 13: కేంద్రపాలిత ప్రాంతమైన యానం బైపాస్‌లోని జాతీయ రహదారి 216పై వాహనాల ఇష్టారాజ్యపు పార్కింగ్ వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను రోడ్డుపైనే నిలిపివేస్తుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రహదారి డివైడర్ పక్కన వాహనాలను నిలిపివేయడంతో ఎదురుగా లేదా పక్క నుంచి వచ్చే వాహనాలు కనిపించకపోవడం ప్రమాదాలకు కారణమవుతోందని చెబుతున్నారు. ఈ ప్రాంతంలో మద్యం దుకాణాలు ఉండటంతో మద్యం సేవించిన కొందరు వాహనదారులు మత్తులో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. నో పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలను నిలిపివేస్తున్నప్పటికీ యానం ట్రాఫిక్ పోలీసులు తగిన చర్యలు తీసుకోవడం లేదంటూ పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు. సామాన్య వాహనదారులపై కేసులు నమోదు చేస్తూ హడావుడి చేసే పోలీసులు, జాతీయ రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిపివేస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి యానం బైపాస్ జాతీయ రహదారి 216పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, నో పార్కింగ్ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని స్థానికులు కోరుతున్నారు. వాహనాల అక్రమ పార్కింగ్‌ను అరికట్టి, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు రహదారిపై ప్రయాణించే వారికి ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## యానంలో సేవా సంకల్ప్ అభియాన్..

# ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

### రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

యానం, మహి న్యూస్, అక్టోబర్ 13: కేంద్రపాలిత ప్రాంతమైన యానంలో పుదుచ్చేరి పోలీస్ శాఖ ఆదేశాల మేరకు సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా కే జంక్షన్, జెండా స్తంభం సెంటర్, బైపాస్ ప్రాంతాల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసులు అవగాహన కల్పించారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్‌సీ), ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్ వంటి సంబంధిత పత్రాలను తమ వెంట ఉంచుకోవాలని సూచించారు. పోలీసుల తనిఖీల సమయంలో ఆయా పత్రాలను తప్పనిసరిగా చూపించాలని తెలిపారు. వాహనం

నడిపేటప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ సురేష్ బాబు, ఎస్ఐలు. ఇలాంగో, పట్టాభి రామయ్య, ట్రాఫిక్ ఎస్ఐ తిరునో వర్మస్, కవల రమణమూర్తి, ఎస్‌జీ. ఏ. ఎస్.ఐ నక్కా శ్రీనివాస్, ప్రతాప్, పంపన మూర్తి తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కనకదుర్గమ్మ భక్తిలో భవానీల పాదయాత్ర

### కనకాలపేట నుంచి విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి భవానీల పాదయాత్ర

యానం, మహి న్యూస్, అక్టోబర్ 13: కేంద్రపాలిత ప్రాంతమైన యానం శివారు కనకాలపేట గ్రామంలో కొలువై ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో 41వ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా భక్తి సందడి నెలకొంది. గురు భవాని పోలిశెట్టి రామకృష్ణ పర్యవేక్షణలో సుమారు వందమంది భక్తులు భవానీ మాలలు ధరించి అమ్మవారి పట్ల తమ భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. ఈ సందర్భంగా మాలధారణ చేసిన భక్తుల్లో 20 మంది భవానీలు కనకాలపేట నుంచి విజయవాడలోని శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయానికి కాలినడకన పాదయాత్రగా బయలుదేరారు. అమ్మవారి ఆశీస్సులు పొందాలనే సంకల్పంతో, భక్తిశ్రద్ధలతో పాదయాత్ర చేపట్టిన భవానీలు మార్గమధ్యంలో అమ్మవారిని స్మరిస్తూ ముందుకు సాగనున్నారు. గురు భవాని పోలిశెట్టి రామకృష్ణ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తులలో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపింది. కనకాలపేట నుంచి విజయవాడ వరకు పాదయాత్ర చేపట్టిన భవానీలకు స్థానిక భక్తులు శుభాకాంక్షలు తెలియజేశారు. అమ్మవారి అనుగ్రహంతో పాదయాత్ర విజయవంతంగా పూర్తికావాలని భక్తులు ఆకాంక్షించారు.

## ఘనంగా 24వ మీసాల వెంకన్న బ్రహ్మోత్సవాలు

### హంస వాహన సేవలో పాల్గొన్న కాపు ఉత్సవ కమిటీ సభ్యులు



యానాం, మహి న్యూస్, అక్టోబర్ 13: యానాం పరిధిలోని శ్రీ మీసాల వెంకన్న స్వామివారి 24వ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన హంస వాహన సేవలో కాపు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొని స్వామివారి సేవలో భాగస్వాములయ్యారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ



కార్యక్రమంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కొమ్మిరెడ్డి వాసు దంపతులు, చింతం అజయ్ కుమార్ దంపతులు, చింతా వెంకన్న దంపతులు, సుంకర కార్తీక్, పెద్దిరెడ్డి బాబీ, నాగు తదితరులతో పాటు కాపు యువత పాల్గొన్నారు. శ్రీ మీసాల వెంకన్న స్వామివారి ఆశీస్సులు అందరిపై ఉండాలని, ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాలు మరింత వైభవంగా నిర్వహించుకోవాలని కమిటీ సభ్యులు ఆకాంక్షించారు.

RNI : APTEL/25/A0108
మహి న్యూస్
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక



## స్థానిక సంస్థల ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

### ఎన్నికల నిబంధనలు, రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాలి

గుంటూరు, అక్టోబర్ 13: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, పురపాలక శాఖ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు, రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారమే ప్రతి అంశాన్ని అమలు చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే వివిధ స్థానాలకు రిజర్వేషన్ల ప్రక్రియను ప్రకటించిన నేపథ్యంలో, వాటిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తూ, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి. జ్యోతి బసు, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, తెనాలి మున్సిపల్ కమిషనర్ జె. రామ అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## "మార్పు" వసతి గృహాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

### 36 వసతి గృహాల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించాలి

### సీసీ కెమెరాలు, రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటు చేయాలి

గుంటూరు, అక్టోబర్ 13: (మహి న్యూస్): "మార్పు" కార్యక్రమం కింద జిల్లాలో చేపట్టిన వసతి గృహాల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో "మార్పు" కార్యక్రమం అమలుపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 36 వసతి గృహాల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పనులు చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా వసతి గృహాల రూపురేఖలు మార్చాలని సూచించారు. వసతి గృహాల ప్రవేశ ద్వారాలు, వంటగదుల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తాడికొండ, రాజా గార్డెన్‌లోని బీసీ వసతి గృహం, గురుకులాల్లో అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని స్పష్టం చేశారు. వసతి గృహాల్లో రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులకు మెరుగైన వసతి సదుపాయాలు కల్పించడం ద్వారా ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడి, వారి వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందని కలెక్టర్ తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వి. శంకర్, జిల్లా సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ సాధికారత అధికారి డి. దుర్గాబాయి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి కె. మయూరి, విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు ఎన్. వెంకటరవణప్ప, రహదారులు భవనాల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ సి. విశ్వనాథరెడ్డి, ఏపీఈడబ్ల్యూఐసీ కార్యనిర్వాహక ఇంజినీర్ అనిల్, హార్ట్‌ఫుల్‌నెస్ ఫౌండేషన్ డీపీఎం హారిక తదితరులు పాల్గొన్నారు.

## అగ్రిగోల్డ్ బాండ్ల పరిశీలనకు తేదీలు ఖరారు

### ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, చేబ్రోలు మండలాల బాధితులకు సూచన

గుంటూరు, అక్టోబర్ 13: (మహి న్యూస్): అగ్రిగోల్డ్ బాండ్ల పరిశీలనలో భాగంగా అక్టోబర్ 13న ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు మండలాల నుంచి వచ్చిన 150 మంది వద్ద ఉన్న 310 అగ్రిగోల్డ్ బాండ్లను అధికారులు పరిశీలించారు. అక్టోబర్ 14న ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు మండలాలకు చెందిన అగ్రిగోల్డ్ బాండ్ల పరిశీలన నిర్వహించనున్నారు. అదేవిధంగా అక్టోబర్ 15, 16 తేదీల్లో చేబ్రోలు మండలానికి చెందిన బాండ్‌దారుల బాండ్లను, బాండ్లపై నమోదైన చిరునామాల ఆధారంగా గుంటూరు రీజనల్ కార్యాలయం, సీఐడీ కార్యాలయంలో పరిశీలిస్తారు. సంబంధిత మండలాలకు చెందిన అగ్రిగోల్డ్ బాండ్‌దారులు ఈ తేదీలను గమనించి, తమకు కేటాయించిన రోజున గుంటూరులోని సీఐడీ రీజనల్ కార్యాలయానికి హాజరుకావాలని సీఐడీ గుంటూరు రీజనల్ అధికారి, అదనపు పోలీసు సూపరింటెండెంట్ బి. సీతారామయ్య తెలిపారు.

## మాచర్ల మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా యెనుముల సుష్మ రెడ్డికి మద్దతు తెలపాలి

### ఐవీఆర్ఎస్ కాల్ ద్వారా తమ అభిప్రాయాన్ని తెలియజేయాలని పిలుపు

మాచర్ల: మాచర్ల మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా యెనుముల కేశవ రెడ్డి సతీమణి యెనుముల సుష్మ రెడ్డికి అవకాశం కల్పించాలని కోరుతూ టీడీపీ మద్దతుదారులు ప్రజలకు పిలుపునిస్తున్నారు. మున్సిపల్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా ఐవీఆర్ఎస్ కాల్ వచ్చినప్పుడు సుష్మ రెడ్డి పేరుతో ఉన్న ఆప్షన్‌ను ఎంచుకుని తమ మద్దతు తెలియజేయాలని కోరుతున్నారు. మాచర్ల ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేలా సుష్మ రెడ్డికి మద్దతు తెలపాలని, అభ్యర్థుల ఎంపికలో ప్రజలు తమ అభిప్రాయాన్ని స్పష్టంగా తెలియజేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా టీడీపీకి, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డికి, యెనుముల కేశవ రెడ్డికి మద్దతుగా నినాదాలు చేశారు.

## గ్యాస్ సబ్సిడీ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

### 24 గంటల్లోగా సంబంధిత వివరాలు అందించాలని గ్యాస్ ఏజెన్సీలకు ఆదేశాలు

మాచర్ల, అక్టోబర్ 13:(మహి న్యూస్): గ్యాస్ వినియోగదారులకు సబ్సిడీ నగదు బ్యాంకు ఖాతాల్లో జమ కాకపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. ప్రజాదర్బార్ కార్యక్రమంలో మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి దృష్టికి పలువురు వినియోగదారులు ఈ సమస్యను తీసుకురావడంతో, ఆయన సూచనల మేరకు మంగళవారం మాచర్ల తహసీల్దారు కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దారు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు ఎస్.కె. బాషా, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు. గ్యాస్ కనెక్షన్ల మొత్తం సంఖ్య, సబ్సిడీకి అర్హులైన వినియోగదారుల జాబితా, వారికి అందాల్సిన సబ్సిడీ మొత్తం, నగదు జమ కావడంలో జాప్యానికి గల సాంకేతిక కారణాలపై చర్చించారు. సంబంధిత వివరాలు, రికార్డులను 24 గంటల్లోగా తహసీల్దారు కార్యాలయానికి అందించాలని గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులను ఆదేశించారు. సబ్సిడీ నగదు జమ కాని వినియోగదారుల జాబితాను అందించాలని పల్నాడు జిల్లా పౌర సరఫరాల అధికారి (జిల్లా సరఫరాల అధికారి)ని తహసీల్దారు కోరారు. అదేవిధంగా వినియోగదారుల గుర్తింపు వివరాల నమోదు, ఇతర సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని ఉప తహసీల్దారు ఎస్.కె. బాషా, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. అర్హులైన వినియోగదారులకు సబ్సిడీ నగదు అందేలా సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

## కొర్నెపాడులో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పరిశీలించిన కలెక్టర్

## బయోచార్ తయారీ విధానాలపై రైతుల్లో అవగాహన పెంచాలి

### వ్యవసాయ ఆధారిత పరిశ్రమలతో మహిళలకు ఆర్థికాభివృద్ధి

గుంటూరు, అక్టోబర్ 13: (మహి న్యూస్): రైతుల భూముల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు బయోచార్ తయారీ విధానాలను రైతుల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ సూచించారు. మంగళవారం వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు గ్రామంలోని రైతు నేస్తం ఫౌండేషన్‌ను కలెక్టర్ సందర్శించారు. అక్కడ ప్రకృతి వ్యవసాయంపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు, ఐదు అంచెల సాగు విధానాలు, ఒంగోలు, కాంక్రీజ్, పుంగనూరు, సాహివాల్, గిర్ దేశీయ ఆవుల జాతుల గురించి తెలుసుకున్నారు. సేంద్రియ ఎరువులు, ఘన జీవామృతం, కషాయాలు, జీవామృతం తయారీ విధానాలను పరిశీలించారు. సమగ్ర వ్యవసాయంలో భాగంగా గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకంపై వివరాలు తెలుసుకున్నారు. ఆవు పేడ, మూత్రంతో ప్రమిదలు, ధూప్‌స్టిక్స్, పిడకలు, వినాయక ప్రతిమలు వంటి ఉత్పత్తుల తయారీని పరిశీలించారు. రైతు నేస్తం ఫౌండేషన్‌లో రెండు రోజులుగా శిక్షణ పొందుతున్న స్వయం సహాయక సంఘాల మహిళలతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను స్థాపించి ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఉన్న అవకాశాలను అడిగి తెలుసుకున్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యంత్రాల పనితీరును పరిశీలించారు. టమాటా సాస్, అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ యంత్రాలు, వేరుశెనగ విత్తనాలు వేరు చేసే యంత్రం, వెన్న తీసే యంత్రం, బూందీ నుంచి నూనె వేరు చేసే యంత్రం, ఎద్దుల గానుగ ద్వారా నూనె తయారీ పరికరాలను చూశారు. పిండి వంటలు, చిరుధాన్యాల బిస్కెట్లు, గరం మసాలా తయారీ యంత్రాలతో పాటు వెజిటబుల్ కట్టర్, ప్యాకింగ్, వాక్యూమ్ ప్యాకింగ్ యంత్రాలు, మోడల్ ఆర్గానిక్ స్టోర్, బయో రీసెర్చ్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై రైతుల్లో మరింత అవగాహన పెంచాలని రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్, పద్మశ్రీ పురస్కార గ్రహీత యడ్లపల్లి వెంకటేశ్వరరావును కోరారు. రైతులకు ఉపయోగపడే బయోచార్ తయారీ పద్ధతులను విస్తృతంగా ప్రచారం చేసి, భూసారాన్ని మెరుగుపరిచే చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎం. పద్మావతి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి. విజయలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ డీపీఎం రాజకుమారి, నాబార్డ్ డీడీఎం శరత్, ఎల్‌డీఎం మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉండరాదు

### రైతులకు సకాలంలో ఎరువులు అందించాలి

### ప్రకృతి వ్యవసాయంపై రైతుల్లో అవగాహన పెంచాలి

గుంటూరు, అక్టోబర్ 13: (మహి న్యూస్): రైతులకు ఎరువుల సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రాథమిక రంగాలపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. యూరియా, ఇతర ఎరువుల డిమాండ్‌ను ముందుగానే అంచనా వేసి, అందుకు అనుగుణంగా సరఫరా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎరువుల పంపిణీ ఎయిమ్స్ యాప్ ద్వారా జరగాలని, రైతుల ఈ-కేవైసీ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వ్యవసాయ అధికారులు, సిబ్బంది పనితీరును మెరుగుపరుచుకోవాలని, రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రాథమిక రంగాల శాఖలు పనిచేయాలని స్పష్టం చేశారు. రైతులకు సకాలంలో సూచనలు, సలహాలు అందించడం ద్వారా పంటల సాగు, పశువుల పోషణ మెరుగుపడి వారు ఆర్థికంగా బలోపేతం కావడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఆవులు, గేదెల పెంపకం ద్వారా పాల ఉత్పత్తిని పెంచడంతో పాటు కోళ్లు, మేకల పెంపకం ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభించేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. ప్రకృతి వ్యవసాయం వైపు ఎక్కువ మంది రైతులు మళ్లేలా చర్యలు తీసుకోవాలని, ముఖ్యమంత్రి ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎం. పద్మావతి మాట్లాడుతూ జిల్లాలో ఈ-పంట నమోదు 97 శాతం పూర్తయిందని, నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. కరువు లెక్కల సేకరణలో సిబ్బంది నిమగ్నం కావడంతో కొంత జాప్యం జరిగిందన్నారు. సీసీఆర్సీ బీమా ప్రక్రియ వంద శాతం పూర్తయిందని, ఎస్సీ లబ్ధిదారులకు మూడు డ్రోన్లు రావాల్సి ఉందని వివరించారు. మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ టి. నరసింహారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో యూరియా, ఇతర ఎరువుల కొరత లేదని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం డీపీఎం రాజకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం కింద 49,620 ఎకరాల్లో 44,029 మంది రైతులతో సాగు చేపట్టేలా లక్ష్యాలు నిర్దేశించినట్లు వివరించారు. ఈ సమావేశంలో ఉద్యాన శాఖ ఉప సంచాలకులు, ఏపీఎంఐపీ పీడీ ఎల్. వజ్రశ్రీ, పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి. సత్యనారాయణ, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు పి. సత్యనారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## నూతన క్యూఆర్ కోడ్ విధానాన్ని రద్దు చేయాలి

### - తహశీల్దార్ వర కుమార్ కు రేషన్ డీలర్ల వినతి



దుర్గి, అక్టోబర్ 13:(మహి న్యూస్): రేషన్ సరుకుల బస్తాలకు ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ స్కానింగ్ విధానం వల్ల క్షేత్రస్థాయిలో తీవ్ర సాంకేతిక సమస్యలు, పనిభారం ఎదురవుతున్నాయని, ఈ విధానాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ దుర్గి మండల రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తహశీల్దార్ వర కుమార్ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డీలర్ల ప్రతినిధులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలలో నెట్‌వర్క్ సమస్యల వల్ల క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం తీవ్ర ఇబ్బందిగా మారిందని, దీనివల్ల సరుకుల పంపిణీ ఆలస్యమవడమే కాకుండా లబ్ధిదారులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**డీలర్ల ప్రధాన డిమాండ్లు:**

1. సాంకేతిక ఇబ్బందులకు కారణమవుతున్న నూతన క్యూఆర్ కోడ్ ఆప్షన్‌ను పూర్తిగా తొలగించాలి.
2. ప్రస్తుత నిత్యావసర ధరలకు అనుగుణంగా డీలర్ల జీవనభృతిని దృష్టిలో ఉంచుకుని కమిషన్‌ను పెంచాలి.
3. పంపిణీ సమయంలో ఎదురవుతున్న సర్వర్, సాంకేతిక లోపాలను సరిచేయాలి. ఈ విధానాన్ని మార్చకపోతే భవిష్యత్తులో పంపిణీ ప్రక్రియ మరింత క్లిష్టంగా మారుతుందని వారు పేర్కొన్నారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ వర కుమార్, ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దుర్గి మండల రేషన్ డీలర్ల అసోసియేషన్ సభ్యులు, స్థానిక డీలర్లు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావం నుంచి పంటల రక్షణకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు

### రైతులకు అవగాహన కల్పించే పుస్తకాన్ని విడుదల చేసిన కలెక్టర్

గుంటూరు, అక్టోబర్ 13: (మహి న్యూస్): ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పంటలను రక్షించుకునే విధానాలపై ప్రకృతి వ్యవసాయ విభాగం రూపొందించిన పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంపై రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటలను సంరక్షించుకొని ఆర్థిక నష్టాలను తగ్గించుకునే విధానాలను రైతులకు వివరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, జిల్లా వ్యవసాయ అధికారి ఎం. పద్మావతి, ప్రకృతి వ్యవసాయ డీపీఎం రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

## గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలపై కఠిన చర్యలు

### వైద్యశాలలు, స్కానింగ్ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి

### కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ

గుంటూరు, అక్టోబర్ 13: (మహి న్యూస్): జిల్లాలో గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలను అరికట్టేందుకు వైద్యశాలలు, స్కానింగ్ కేంద్రాల్లో తరచూ ఆకస్మిక తనిఖీలు, డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం (పీసీ-పీఎన్‌డీటీ), సహాయక పునరుత్పత్తి సాంకేతికత (ఏఆర్టీ) చట్టాల అమలుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే వైద్యులు, స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్కానింగ్ కేంద్రాలు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలను పూర్తిగా అరికట్టేందుకు కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు సెషన్స్ జిల్లా న్యాయమూర్తులు వై. నాగరాజా, వెంకట నాగ శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం. పద్మావతి, డీఎస్పీ సీతారామయ్య, ఐసీడీఎస్ పీడీ ప్రసూన, డెమో సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారంలో శ్రీ లక్ష్మీ అమ్మవారు

### అడిగొప్పలలో వైభవంగా శరన్నవరాత్రి పూజలు



మాచర్ల, అక్టోబర్ 13: (మహి న్యూస్): పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం, దుర్గి మండలం అడిగొప్పల గ్రామంలో కొలువై ఉన్న శ్రీ నిదానంపాటి శ్రీ లక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శ్రీ అన్నపూర్ణాదేవి రూపంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని భక్తిశ్రద్ధలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అన్నపూర్ణాదేవి అనుగ్రహంతోప్రజలందరికీసుఖసంతోషాలు,ఆయురారోగ్యాలు,అష్టైశ్వర్యాలు కలగాలని భక్తులు ప్రార్థించారు.

## స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్

### విజయవాడ నుంచి నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న తిరుపతి జిల్లా అధికారులు

తిరుపతి, అక్టోబర్ 13: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలపై విజయవాడ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ పరిపాలన శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎం. జయకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రజాపంపిణీ వ్యవస్థలో అక్రమాలకు తావివ్వొద్దు

### రేషన్ సరుకుల పంపిణీలో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు

చిత్తూరు, అక్టోబర్ 13: (మహి న్యూస్): ప్రజాపంపిణీ వ్యవస్థలో పారదర్శకత పాటిస్తూ, రేషన్ సరుకులను లబ్ధిదారులకు సకాలంలో అందించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. తూకాల్లో మోసాలు, అధిక ధరలకు విక్రయాలు, రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ-కేవైసీ, ఆధార్-మొబైల్ అనుసంధాన ప్రక్రియను వేగవంతం చేయాలని, చౌకధరల దుకాణాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సూచించారు. అక్రమాలపై 6ఏ కేసులు నమోదు చేయడంతో పాటు సీసీటీవీ ఏర్పాట్లను పర్యవేక్షించాలని తెలిపారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వసతి గృహాల్లో ఆహార నాణ్యత, పరిశుభ్రతను తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని పేర్కొన్నారు.

## తిరుపతి మేయర్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఏర్పాట్ల పరిశీలన

### ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాళ్లపై సమీక్ష

తిరుపతి, అక్టోబర్ 13: (మహి న్యూస్): తిరుపతి నగరపాలక సంస్థ స్థానిక ఎన్నికలు-2026లో భాగంగా ఓట్ల లెక్కింపు నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ మంగళవారం సాయంత్రం పరిశీలించారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, మున్సిపల్ కమిషనర్ ఎం. జయకృష్ణ, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావుతో కలిసి ఎస్వీ ఆర్ట్స్ కళాశాలను సందర్శించారు. కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లు, వార్డుల ఓట్ల లెక్కింపు హాళ్లు, మేయర్ ఎన్నిక ఓట్ల లెక్కింపు హాల్, ఎన్నికల సామగ్రి నిల్వ గదులు, అభ్యర్థులు, ఏజెంట్ల నిరీక్షణ గదులు, మీడియా గది, కంట్రోల్ రూమ్ ఏర్పాట్లను పరిశీలించారు. గదుల కేటాయింపు, సిబ్బంది ఏర్పాట్లు, భద్రతా చర్యలపై అధికారులతో చర్చించారు. ప్రతిపాదనల ప్రకారం మొదటి అంతస్తులో 1 నుంచి 18వ వార్డు వరకు, రెండో అంతస్తులో 19 నుంచి 66వ వార్డు వరకు స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించారు. మేయర్ పదవికి సంబంధించిన ఓట్ల లెక్కింపు కోసం మొదటి అంతస్తులోని సెంట్రల్ హాల్‌ను ప్రతిపాదించారు. స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటుపై జిల్లా ఎన్నికల అధికారి ఆమోదానికి అనుగుణంగా నిర్ణయం తీసుకోనున్నారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవి మనోహరాచారి, శ్రీలత, ఎన్నికల డిప్యూటీ కలెక్టర్ భరత్ నాయక్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ అమరయ్య, తిరుపతి స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, తిరుపతి అర్బన్ తహసీల్దార్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యల పరిష్కారంలో జాప్యం చేయొద్దు

### నిర్ణీత గడువులో రీసర్వే పూర్తి చేయాలి జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

చిత్తూరు, అక్టోబరు 13: (మహి న్యూస్): రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, భూ రీసర్వే ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ, భూ పరిపాలన అంశాలపై జిల్లా, డివిజన్ స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. రీసర్వేలో భూముల సరిహద్దులు, హక్కులు, రికార్డుల ఖచ్చితత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పాత భూ రికార్డులను క్షేత్రస్థాయి వివరాలతో సరిపోల్చి, తప్పులకు తావులేకుండా పనులు చేపట్టాలన్నారు. ఆరో విడత రీసర్వే చిత్తూరు డివిజన్‌లో 41 గ్రామాలు, నగరి డివిజన్‌లో 7 గ్రామాల్లో కొనసాగుతోందని, ఈ పనులను డిసెంబర్ 31, 2026 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. నాలుగో విడతలో 101 గ్రామాల్లో రీసర్వే జరుగుతోందని తెలిపారు. రీసర్వే పురోగతిని రోజువారీగా పర్యవేక్షించి, వారానికోసారి నివేదికలు సమర్పించాలని సూచించారు. రెవెన్యూ ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సర్వే డీడీ జయరాజ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ మొగిలేశ్వర స్వామి దేవస్థానం నందు శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవములు...

### మూడవ రోజు "మూలవిరాట్టు అమ్మవారికి చందన " అలంకారం.

చిత్తూరు జిల్లా/ బంగారుపాళ్యం మహి న్యూస్ అక్టోబర్ 13.: శ్రీ మొగిలీస్వర స్వామి దేవస్థానము నందు శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవములు ది.11.10.2026 నుండి ది.20.10.2026 వరకు వైభవముగా నిర్వహించబడుచున్నవి. 13.10.2026 న సాయంత్రం కామాక్షి దేవి అమ్మవారికి ఉదయం అభిషేకం, అలంకరణ, మహా దీపారాధన నిర్వహించడం జరిగినది. అనంతరం శ్రీ మొగిలీశ్వర స్వామి వారికి అభిషేకం, అలంకరణ, మహా దీపారాధన చేయడం జరిగినది.సాయంత్రము శ్రీ అమ్మవారికి కుంకుమార్చన,ధూపదీప నైవేద్యములతో మహాదీపారాధన కార్యక్రమం చేపట్టడం జరిగినది.నవరాత్రి ఉత్సవమునకు ఉభయ దారులుగా బి .జనార్ధన్ నలగాంపల్లి వారి కుటుంబ సభ్యులు మరియు ఎన్ .పి .రాధాకృష్ణ బంగారుపాళ్యం వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.వీరికి వేద మంత్రాలతో ఆశీర్వదించి ప్రసాదం ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కమల్నాదరెడ్డి మరియు సభ్యులు ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# తిరుచానూరులో 100 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డుకు శంకుస్థాపన

### రూ.44 కోట్లతో పద్మావతి అమ్మవారి ఆలయానికి మెరుగైన రహదారి ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, భక్తులకు సులభతర రాకపోకలే లక్ష్యం

తిరుపతి, అక్టోబర్ 13: (మహి న్యూస్): తిరుపతి మహానగరంలో రవాణా సౌకర్యాలను మెరుగుపరిచి, తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి మెరుగైన కనెక్టివిటీ కల్పించే లక్ష్యంతో 100 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం తిరుచానూరు పంచాయతీ పరిధిలో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులకు తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానితో కలిసి కలెక్టర్ శంకుస్థాపన చేశారు. కొత్రమంగళం రోడ్డు జంక్షన్ నుంచి పూడి రోడ్డు జంక్షన్ వరకు రూ.44 కోట్ల తుడా, టీటీడీ నిధులతో 100 అడుగుల వెడల్పుతో మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జాతీయ రహదారి నుంచి అమ్మవారి ఆలయానికి వెళ్లే మార్గంలో ప్రస్తుతం ఉన్న ఇరుకైన రోడ్ల కారణంగా ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు ఈ రహదారి ఉపయోగపడుతుందన్నారు. అలాగే ఎన్‌హెచ్-71లోని కోర్టు కాంప్లెక్స్ నుంచి కొత్రమంగళం రోడ్డు జంక్షన్ వరకు రూ.20 కోట్లతో మరో 100 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ రహదారి ద్వారా జిల్లా కోర్టు సముదాయం, అంతర్జాతీయ క్రీడా సముదాయానికి కేటాయించిన భూమి, స్వర్ణముఖి రివర్ ఫ్రంట్ ప్రాంతాలకు అనుసంధానం కల్పిస్తామన్నారు. శెట్టిపల్లి టౌన్‌షిప్ నుంచి దామినేడు వరకు రూ.19.10 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. రోడ్ల నిర్మాణంలో ఇళ్లు లేదా ఇతర నిర్మాణాలు కోల్పోయే వారికి నిబంధనల ప్రకారం టీడీఆర్ బాండ్లు, వర్తించే పరిహారం అందించే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధి పనులు కొనసాగిస్తామన్నారు. తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు తిరుచానూరు అమ్మవారిని కూడా దర్శించుకోవడం ఆనవాయితీగా ఉందన్నారు. బ్రహ్మోత్సవాలు, పంచమి తీర్థం వంటి ప్రత్యేక సందర్భాల్లో లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, ఇతర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో తుడా, టీటీడీ ఆధ్వర్యంలో ఎనిమిది మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులకు ప్రారంభోత్సవాలు, భూమిపూజ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అక్టోబర్ 12న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేసిన అనంతరం క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. తిరుచానూరు ఆలయానికి వచ్చే భక్తులు రద్దీ రోజుల్లో ఎదుర్కొనే ట్రాఫిక్ సమస్యలను తగ్గించడంతో పాటు, అవసరమైన చోట్ల పార్కింగ్ సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. బహుళ అంతస్తుల పార్కింగ్ కేంద్రాల ఏర్పాటుపైనా పరిశీలన చేస్తున్నట్లు వెల్లడించారు. టీటీడీ బోర్డు సభ్యుడు భాను ప్రకాష్ మాట్లాడుతూ తిరుపతి అభివృద్ధిలో భాగంగా తుడా, టీటీడీ నిధులతో తిరుచానూరులో రహదారుల నిర్మాణానికి నిధులు కేటాయించడం శుభపరిణామమన్నారు. భక్తులకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించి, యాత్రికులకు ఇబ్బందులు లేకుండా చూడడమే లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# రుయా ఆసుపత్రిలో రూ.కోటితో 15 పడకల అదనపు ఎమర్జెన్సీ బ్లాక్

### జెఎంసీ ట్రస్ట్ నుంచి రూ.50 లక్షలు, కలెక్టర్ నిధుల నుంచి మరో రూ.50 లక్షలు నాలుగు నుంచి ఐదు నెలల్లో నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యం

తిరుపతి, అక్టోబర్ 13: (మహి న్యూస్): తిరుపతిలోని రుయా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అత్యవసర వైద్య సేవలను బలోపేతం చేసేందుకు రూ.కోటి వ్యయంతో అదనంగా 15 పడకల ఎమర్జెన్సీ బ్లాక్ నిర్మాణానికి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మంగళవారం భూమిపూజ చేశారు. ఈ నిర్మాణానికి తిరుపతి ఎమ్మెల్యేకు చెందిన జెఎంసీ ట్రస్ట్ తరపున రూ.50 లక్షలు అందించనుండగా, మిగిలిన రూ.50 లక్షలను జిల్లా కలెక్టర్ నిధులతో పాటు ఆసుపత్రి అభివృద్ధి సంఘం, వైద్య కళాశాల అభివృద్ధి సంఘం, ఎన్టీఆర్ వైద్య సేవ తదితర అందుబాటులో ఉన్న నిధుల ద్వారా సమకూర్చనున్నారు. ప్రస్తుతం రుయా ఆసుపత్రి క్యాజువాలిటీలో 25 పడకలు మాత్రమే ఉండగా, రోజుకు సుమారు 300 మంది అత్యవసర వైద్యం కోసం వస్తున్నారని కలెక్టర్ తెలిపారు. రోగుల రద్దీకి అనుగుణంగా అదనపు పడకలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా భాగస్వామ్యంతో వైద్య రంగంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే లక్ష్యమని పేర్కొన్నారు. భవిష్యత్తులో క్రిటికల్ కేర్ బ్లాక్‌లో మరో 100 పడకలు ఏర్పాటు చేసే ప్రణాళిక ఉందని కలెక్టర్ వెల్లడించారు. అయితే ఆ నిర్మాణం పూర్తవడానికి మూడు నుంచి నాలుగు సంవత్సరాలు పట్టే అవకాశం ఉన్నందున, ప్రస్తుత అవసరాలను దృష్టిలో ఉంచుకుని అదనపు ఎమర్జెన్సీ బ్లాక్ నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. నాలుగు నుంచి ఐదు నెలల్లో పనులు పూర్తి చేసి రోగులకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటామన్నారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ రుయా ఆసుపత్రికి తిరుపతితో పాటు పరిసర ప్రాంతాలు, ఇతర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు వస్తున్నారని తెలిపారు. గత రెండేళ్లుగా అత్యవసర విభాగంలో రోగుల రద్దీ పెరిగి, ఒక్కో పడకపై ఇద్దరు, ముగ్గురికి చికిత్స అందించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. అదనపు పడకల బ్లాక్ అందుబాటులోకి వస్తే రోగుల రద్దీ తగ్గడంతో పాటు, పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన అత్యవసర వైద్య సేవలు అందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బాలకృష్ణ నాయక్, రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ మనోహర్, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, ప్రజాప్రతినిధులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## వజ్రాలపురం బోయకొండ గంగమ్మ దేవస్థానంలో మూడవరోజు అన్నపూర్ణాదేవిగా అలంకరణ

చిత్తూరు జిల్లా బంగారుపాలెం మహి న్యూస్ అక్టోబర్ 13.: చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలం శ్రీ వజ్రాలపురం బోయకొండ గంగమ్మ దేవస్థానం లో దేవి శరన్నవరాత్రి సందర్భంగా మూడవ రోజు అమ్మవారిని శ్రీ అన్నపూర్ణాదేవిగా అలంకరించి ఆలయ అర్చకులు మొగిలప్ప స్వామి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయదారులుగా నలగంపల్లె గ్రామస్తులైన బుస్సా ఆదిలక్ష్మి జనార్దన్ గౌడ్, బుస్సా రెడ్డమ్మ నాగరాజు గౌడ్ ఉభయదారులుగా వ్యవహరించి అమ్మవారి తీర్థ ప్రసాదములు అందజేసి భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు స్వర్గీయ శ్రీమతి రాధమ్మ కృష్ణప్ప వారి కుమారులు కే. పురుషోత్తం కే.గోపి వారి ఆదేశాల మేరకు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు శివలింగయ్య నాగరాజ,రాజేంద్ర నాయుడు రామ్మూర్తి నాయుడు సుబ్బానాయుడు శంకరయ్య మురళి తులసి బాబు వేణుగోపాల్ నాయుడు ఆలయ మేనేజర్ మొగిలిప్ప పర్యవేక్షించారు.

## తిరుపతి జిల్లాలో 30 సేల్స్ అసోసియేట్ ఉద్యోగాలు

### 18 నుంచి 25 ఏళ్ల యువతకు అవకాశం అక్టోబర్ 17న ఇంటర్వ్యూలు

తిరుపతి, అక్టోబర్ 13: (మహి న్యూస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్డీసీ) ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం ద్వారా తిరుపతి జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీలో సేల్స్ అసోసియేట్ పోస్టులకు మొత్తం 30 ఖాళీలు ఉన్నాయి. ఇంటర్ లేదా డిగ్రీ పూర్తి చేసిన 18 నుంచి 25 ఏళ్ల పురుషులు, మహిళలు అర్హులు. ఎంపికైన వారికి నెలకు రూ.9,000 వేతనంతో పాటు ప్రోత్సాహకాలు అందిస్తారు. తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, రైల్వే కోడూరు, వెంకటగిరి ప్రాంతాల్లో ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి. అర్హులైన అభ్యర్థులు అక్టోబర్ 17న ఉదయం 9.30 గంటలకు ఇంటర్వ్యూకు హాజరుకావాలి. ఇంటర్వ్యూ వేదిక: మొదటి అంతస్తు, కృష్ణ నికుంజ్, నిత్య హోమ్స్, నంబర్ 93/1, పార్క్ హోటల్, ఎస్వీ ఆటో నగర్ ఎదురుగా, రేణిగుంట రోడ్, తిరుపతి. వివరాలకు 8886086072, 9177508279, 9988853335 నంబర్లను సంప్రదించాలి. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం ఖుఅఱూబఅఖుఎ.ఖుఱూ.స్రశీజ.అఅ వెబ్‌సైట్‌ను సందర్శించాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్. లోకనాథం తెలిపారు.

## కుప్పంలో పరిశ్రమలు, ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాల తనిఖీ

### కాలుష్య నియంత్రణ చర్యలు పటిష్టంగా అమలు చేయాలి ఏపీపీసీబీ చైర్మన్ డాక్టర్ పి. కృష్ణయ్య

కుప్పం, అక్టోబర్ 13: (మహి న్యూస్): కుప్పం పారిశ్రామిక ప్రాంతం, మున్సిపాలిటీలో పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ చర్యలను ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) చైర్మన్ డాక్టర్ పి. కృష్ణయ్య సమీక్షించారు. మంగళవారం మండలి సభ్యుడు నాగేశ్వరరాజుతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా హిందాల్కో ఇండస్ట్రీస్ లిమిటెడ్ పరిశ్రమను తనిఖీ చేసి, వ్యర్థ జలాల శుద్ధి, శుద్ధి చేసిన నీటి పునర్వినియోగం, జీరో లిక్విడ్ డిశ్చార్జ్ వ్యవస్థ పనితీరును పరిశీలించారు. కాలుష్య నియంత్రణ వ్యవస్థలను నిరంతరం పర్యవేక్షిస్తూ, పర్యావరణ ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పారిశ్రామిక ప్రాంతాల్లో వాయు, జల కాలుష్య నియంత్రణ చర్యలు, పచ్చదనం పెంపు, కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల అమలును సమీక్షించారు. అనంతరం కుప్పం మున్సిపాలిటీ సమీకృత ఘన వ్యర్థాల శుద్ధి, ప్రాసెసింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. తడి, పొడి వ్యర్థాలను వేరు చేసి శాస్త్రీయ పద్ధతుల్లో ప్రాసెసింగ్ చేయాలని, పాత వ్యర్థాల తొలగింపునకు చేపడుతున్న బయోమైనింగ్ పనులను పర్యావరణానికి హాని కలగకుండా నిర్వహించాలని సూచించారు. పరిశ్రమలు, పట్టణ స్థానిక సంస్థలు రీసైక్లింగ్‌ను ప్రోత్సహిస్తూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని చైర్మన్ పేర్కొన్నారు.

## చిత్తూరు జిల్లాలో మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పర్యటన

### ఎస్సీ కార్పొరేషన్ పథకాల పునరుద్ధరణపై సమీక్ష

**చిత్తూరు, అక్టోబర్ 13: (మహి న్యూస్): ఆంధ్రప్రదేశ్ మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ వుండవల్లి శ్రీదేవి అక్టోబర్ 14న చిత్తూరు జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ పథకాల పునరుద్ధరణపై సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు చిత్తూరులోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సమావేశం జరగనుంది. ఈ వివరాలను ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జి కార్యనిర్వాహక సంచాలకులు శ్రీదేవి వెల్లడించారు.**

## ప్రతి గ్రామంలో శ్రామికులకు పనులు కల్పించాలి

### జలధార పనులను పరిశీలించిన కలెక్టర్ డా. ఏ. సిరి

### అర్హులైన పేదలకు ఇళ్ల దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక డ్రైవ్

కర్నూలు, అక్టోబర్ 13: (మహి న్యూస్): ప్రతి గ్రామంలో వీబీజీ రామ్ జీ పథకం కింద శ్రామికులకు పనులు కల్పించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఓర్వకల్లు మండలం హుస్సేనాపురం గ్రామంలో జలధార -- జలహారతి 2.0 కింద చేపడుతున్న నీటి సంరక్షణ పనులను కలెక్టర్ పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేని వారికి ఉపాధి కల్పించాలని, పనులు కల్పించడం లేదనే ఫిర్యాదులు రాకుండా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీని ఆదేశించారు. శ్రామికులకు నిర్దేశించిన లక్ష్యాల మేరకు తగిన పనిదినాలు కల్పించడంతో పాటు తాగునీరు వంటి కనీస సౌకర్యాలు అందించాలని సూచించారు. పనులకు ఎంతమంది హాజరవుతున్నారు, ఉదయం ఏ సమయానికి వస్తున్నారు, వారికి అవసరమైన సౌకర్యాలు ఉన్నాయా అనే వివరాలను

అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రామికులతో మాట్లాడిన కలెక్టర్ రోజువారీ వేతనాలు సక్రమంగా అందుతున్నాయా, ఏవైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. రేషన్ సరుకులు సకాలంలో పంపిణీ చేస్తున్నారా, అర్హులకు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందుతున్నాయా అనే వివరాలను కూడా తెలుసుకున్నారు. అర్హులైన పేద కుటుంబాలకు ఇళ్ల నిర్మాణ పథకం కింద దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని హౌసింగ్ పీడీ, ఓర్వకల్లు తహసీల్దార్‌ను ఆదేశించారు. ఇళ్లు లేని అర్హులైన లబ్ధిదారుల నుంచి రెండు రోజుల్లోగా దరఖాస్తుల సేకరణ పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ నరసింహారెడ్డి, ఓర్వకల్లు తహసీల్దార్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మావోయిస్టు కుటుంబానికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇల్లు

### నందమూరి నగర్‌లో నూతన గృహాన్ని ప్రారంభించిన కలెక్టర్ రాజకుమారి గణియా

నంద్యాల, అక్టోబర్ 13: (మహి న్యూస్): జనజీవన స్రవంతిలోకి వచ్చిన మాజీ మావోయిస్టు బోయ కృష్ణవేణికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 పథకం కింద ఇల్లు మంజూరైంది. నంద్యాల పట్టణంలోని నందమూరి నగర్‌లో నిర్మించిన ఆమె నూతన గృహాన్ని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన పేద కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 పథకం ద్వారా గృహ వసతి కల్పిస్తోందని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో సొంత ఇళ్లు లేని అర్హులైన కుటుంబాలకు సురక్షితమైన నివాస సదుపాయం కల్పించడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీడీ శ్రీహరి గోపాల్, డీఈ విజయ్ బాబు, ఏఈ విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ తదితర అధికారులు పాల్గొన్నారు.

## నదులు, కాలువల్లో చెత్త వేస్తే జరిమానా తప్పదు

### ప్రజారోగ్య పరిరక్షణకు సహకరించాలి: కమిషనర్ చల్లా ఓబులేసు

కర్నూలు, అక్టోబర్ 13: (మహి న్యూస్): నదులు, కాలువలు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా నగర ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. మంగళవారం కేసీ కెనాల్‌లోని వినాయక ఘాట్, రాజ్‌విహార్, వై. జంక్షన్, బిర్లా కాంపౌండ్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కాలువల్లో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు వేయడం వల్ల నీటి ప్రవాహానికి ఆటంకం కలగడంతో పాటు దోమలు, ఈగలు పెరిగి ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడుతుందని తెలిపారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. రోడ్ల పక్కన, నదులు, కాలువల్లో చెత్త వేసేవారిపై నిబంధనల ప్రకారం జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఈ చర్యలను పర్యవేక్షించేందుకు కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు నగరపాలక సంస్థకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఫరుక్, జిలానీ పాల్గొన్నారు.

## మోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానం సందర్భంగా మెడికల్ క్యాంపు

### పాణ్యం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్య శిబిరం

### ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

పాణ్యం, అక్టోబర్ 13: (మహి న్యూస్): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా పాణ్యం మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

# గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

## నిర్మాణ నాణ్యత, మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి

## హుసేనాపురం హౌసింగ్ లేఔట్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

కర్నూలు, అక్టోబర్ 13: (మహి న్యూస్): గృహ నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఓర్వకల్లు మండలం

హుసేనాపురం గ్రామంలోని హౌసింగ్ లేఔట్‌లో వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, పనుల పురోగతిని సమీక్షించారు. నిర్మాణాలను వేగవంతం చేసి, లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. గృహ నిర్మాణాల్లో బేస్‌మెంట్, రూఫ్ లెవల్, ఆర్సీ లెవల్, మరుగుదొడ్ల నిర్మాణం, తుది దశ పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ దశలకు సంబంధించిన బిల్లుల సమర్పణ, ఆమోదం, చెల్లింపుల ప్రక్రియను సమీక్షించారు. నిబంధనల ప్రకారం బిల్లులను సకాలంలో పూర్తి చేసి, లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందించాలని ఆదేశించారు. సిమెంట్, స్టీల్, ఇసుక, ఇటుకల ధరలు, కూలీల ఖర్చులు, నిర్మాణ వ్యయాల వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ సామగ్రి లభ్యతపై దృష్టి సారిస్తూ, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. పిల్లర్లు, స్లాబ్ నిర్మాణం, లీకేజీల నివారణ వంటి సాంకేతిక అంశాల్లో సమస్యలు తలెత్తితే ఇంజినీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. హౌసింగ్ లేఔట్‌లో తాగునీరు, విద్యుత్, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల కల్పనపై కలెక్టర్ ఆరా తీశారు. లబ్ధిదారులకు అవసరమైన సదుపాయాలు కల్పించడంలో జాప్యం లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిర్మాణాల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, లబ్ధిదారుల సమస్యలను

పరిష్కరించి పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లను సందర్శించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటి నిర్మాణానికి చేసిన ఖర్చు, నిర్మాణ పనుల వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ నరసింహారెడ్డి, తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో ఎం. నాగ అనసూయ తదితరులు పాల్గొన్నారు.

# కీలక పనితీరు సూచికల లక్ష్యాలను సాధించాలి

## వెనుకబడిన శాఖలు పనితీరును మెరుగుపరుచుకోవాలి నిర్దేశిత గడువులోగా లక్ష్యాలు పూర్తి చేయాలి

కర్నూలు, అక్టోబర్ 13: (మహి న్యూస్): జిల్లాలో కీలక పనితీరు సూచికల (కేపీఐ) లక్ష్యాల సాధనలో వెనుకబడిన శాఖలు పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. శాఖల పనితీరును మెరుగుపరుచుకొని, నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో కీలక పనితీరు సూచికలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న గ్రేడ్ నుంచి మెరుగైన గ్రేడ్‌కు చేరుకునేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మత్స్యశాఖపై సమీక్షిస్తూ సుంకేశుల ప్రాంతంలో సిద్ధంగా ఉన్న చేప పిల్లలను అనుకూలమైన నీటి వనరుల్లో త్వరగా విడుదల చేయాలని ఆదేశించారు. చేప పిల్లల ఉత్పత్తి, నిల్వ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు నీటి లభ్యతకు అనుగుణంగా చేపల పెంపకాన్ని ప్రోత్సహించాలని మత్స్యశాఖ డీడీని సూచించారు. మధుమేహం, అధిక రక్తపోటు రోగులకు స్క్రీనింగ్, తదుపరి వైద్య పరీక్షలు, చికిత్సల విషయంలో ఆశించిన పురోగతి లేదని కలెక్టర్ పేర్కొన్నారు. సంచార చికిత్స కార్యక్రమం ద్వారా రోగులకు నిరంతర వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందుల లభ్యతను పరిశీలించి, రోగుల తదుపరి వైద్య పరీక్షలను మెరుగుపరచాలని ఆదేశించారు. గృహ నిర్మాణాల పనితీరు సూచికల్లో మెరుగైన గ్రేడ్ సాధించేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ పీడీని ఆదేశించారు. నిర్మాణాల్లో వెనుకబాటుకు గల కారణాలను గుర్తించి, పనులను వేగవంతం చేయాలని సూచించారు. నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసి కేపీఐలో 'ఏ' గ్రేడ్ సాధించేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ పథకం కింద వ్యక్తిగత గృహ మరుగుదొడ్ల నిర్మాణాల పురోగతిపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వార్షిక లక్ష్యం 4,200 కాగా, ఇప్పటివరకు సాధించిన పురోగతి లక్ష్యానికి అనుగుణంగా లేదన్నారు. నవంబర్ నెలాఖరులోగా కనీసం 3,000 మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేసి, సీ-గ్రేడ్ నుంచి బీ-గ్రేడ్‌కు చేరుకోవాలని ఆదేశించారు. హౌసింగ్ ఫర్ ఆల్ విభాగంలో నవంబర్ 18లోగా నిర్దేశిత లక్ష్యాలను సాధించి బీ-గ్రేడ్‌కు చేరుకోవాలని, జనవరి నాటికి ఏ-గ్రేడ్ సాధించే దిశగా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. దివ్యాంగులకు వినికిడి యంత్రాల పంపిణీకి సంబంధించి అందుబాటులో ఉన్న యంత్రాలను అర్హులైన లబ్ధిదారులకు వెంటనే అందించాలని ఆదేశించారు. దివ్యాంగుల సంఖ్యను అంచనా వేసేందుకు అవసరమైన శిబిరాలను నిర్వహించడంలో జాప్యం చేయరాదని, సంబంధిత పనితీరు సూచికల్లో మెరుగైన గ్రేడ్ సాధించేందుకు శిబిరాల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని వివిధ్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అధికారిని ఆదేశించారు. సమావేశంలో సీపీఓ భారతి, మత్స్యశాఖ డీడీ రంగనాథ్ బాబు, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, వివిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అధికారి రాయిస్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

## పాణ్యంలో వ్యవసాయ యంత్రాల బ్యాంకు ప్రారంభం

### ప్రాసెసింగ్ యూనిట్ షెడ్డు నిర్మాణానికి భూమి పూజ పొదుపు సంఘాలు

### ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే గౌరు చరిత

పాణ్యం, అక్టోబర్ 13: (మహి న్యూస్)పొదుపు సంఘాల మహిళల ఆర్థిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. ప్రతి కుటుంబం, ప్రతి మహిళ లక్షాధికారి కావాలనే లక్ష్యంతో రుణాలు, ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాణ్యంలోని పొదుపు లక్ష్మి భవనంలో వ్యవసాయ యంత్రాల బ్యాంకును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ప్రాసెసింగ్ యూనిట్ షెడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. పొదుపు సంఘాల మహిళలు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సహకారాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే సూచించారు.

## జి. పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాలలో విపత్తుల నివారణపై అవగాహన సదస్సు

### విపత్తులను ఎదుర్కొనేందుకు ముందస్తు జాగ్రత్తలు అవసరం ఇంట్లోనే భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలి



కర్నూలు, అక్టోబర్ 13: (మహి న్యూస్): అంతర్జాతీయ విపత్తుల ప్రమాదాల తగ్గింపు దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్నూలులోని జి. పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాలలో మై భారత్ కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన అధికారి టి. ఐజయ్య మాట్లాడుతూ విపత్తుల వల్ల ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించడం, ప్రజల్లో అవగాహన పెంచడం ఈ దినోత్సవం లక్ష్యమని తెలిపారు. ఏపీ స్పెషల్ పోలీస్ డీఎస్పీ మహబూబ్ బాషా మాట్లాడుతూ 2026 సంవత్సరపు థీమ్ "రిజిలియన్స్ స్టార్ట్స్ ఎట్ హోమ్" అని, విపత్తులను తట్టుకునే సామర్థ్యం ప్రతి ఇంటి నుంచే ప్రారంభం కావాలని వివరించారు. ప్రతి ఇంట్లో ప్రథమ చికిత్స కిట్, టార్చ్‌లైట్, అవసరమైన మందులు, తాగునీరు, అత్యవసర ఆహార పదార్థాలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. అగ్నిమాపక శాఖ అదనపు జిల్లా అధికారి వై. చిన్న బజారి మాట్లాడుతూ వరదలు, తుఫానులు, వడగాలులు, అగ్నిప్రమాదాలపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అధికారుల హెచ్చరికలను పాటించాలని తెలిపారు. ఎస్ఐ డి. అలీ బాబా మాట్లాడుతూ విపత్తుల సమయంలో వృద్ధులు, చిన్నపిల్లలు, దివ్యాంగులు, గర్భిణులకు సహాయం అందించడంలో యువత ముందుండాలని కోరారు. విపత్తుల నిర్వహణ శిక్షకురాలు శాంతకుమారి, అగ్నిమాపక శాఖ సిబ్బంది విద్యార్థులకు విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, స్టూడెంట్స్ కార్యకలాపాల డీన్ జి. శశికుమార్, ఎన్ఎస్ఎస్ అధికారి శంకర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్రిగోల్డ్ బాధితుల బాండ్ల పరిశీలన, నమోదు

### అక్టోబర్ 14 నుంచి 17 వరకు కార్యక్రమం సిరివెళ్ల, ఓర్వకల్ మండలాల బాధితులకు అవకాశం

కర్నూలు, అక్టోబర్ 13: (మహి న్యూస్): అగ్రిగోల్డ్ బాధితుల బాండ్ల పరిశీలన, నమోదు కార్యక్రమం అక్టోబర్ 14 నుంచి 17 వరకు నిర్వహించనున్నట్లు ప్రాంతీయ సీఐడీ అదనపు ఎస్పీ ఎన్. పూజిత తెలిపారు. నంద్యాల జిల్లా సిరివెళ్ల మండలం, కర్నూలు జిల్లా ఓర్వకల్ మండలానికి చెందిన బాధితులు ఈ కార్యక్రమానికి హాజరుకావచ్చు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బాండ్ల పరిశీలన, నమోదు జరుగుతుంది. వేదిక: ప్రాంతీయ సీఐడీ కార్యాలయం, ఏపీ టూరిజం హోటల్ సమీపంలో, రామలింగేశ్వర నగర్, కర్నూలు. సంబంధిత పత్రాలతో హాజరై బాండ్ల పరిశీలన, నమోదు చేయించుకోవాలని బాధితులకు సూచించారు.

## ప్రపంచ కెటిల్‌బెల్ ఛాంపియన్‌షిప్‌లో జీలానీ బాషాకు రెండు స్వర్ణ పతకాలు

### యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకం: కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

కర్నూలు, అక్టోబర్ 13: (మహి న్యూస్): న్యూఢిల్లీలో అక్టోబర్ 5 నుంచి 9 వరకు నిర్వహించిన ఐయూకేఎల్ ప్రపంచ కెటిల్‌బెల్ ఛాంపియన్‌షిప్‌లో కర్నూలు జిల్లాకు చెందిన ఎస్. జీలానీ బాషా రెండు స్వర్ణ పతకాలు సాధించారు. ఆంధ్రప్రదేశ్ తరఫున పాల్గొని ప్రపంచ స్థాయి పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించి రాష్ట్రానికి, కర్నూలు జిల్లాకు గర్వకారణంగా నిలిచారని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అభినందించారు. జీలానీ బాషా విజయం యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెట్కూరు సీఈఓ డాక్టర్ వేణుగోపాల్, క్రీడా అభివృద్ధి అధికారి భూపతి రావు పాల్గొన్నారు.

## నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాలలో విపత్తుల నివారణపై అవగాహన

### మాక్ డ్రిల్స్‌తో విద్యార్థులకు భద్రతా చర్యలపై శిక్షణ



నంద్యాల, అక్టోబర్ 13: (మహి న్యూస్): అంతర్జాతీయ విపత్తుల ప్రమాద తగ్గింపు దినోత్సవాన్ని పురస్కరించుకుని మై భారత్ నంద్యాల జిల్లా ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. సురేఖ, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కిరణ్, జిల్లా అగ్నిమాపక అధికారి శంకర్ ప్రసాద్, ఎస్‌డీఆర్ఎఫ్ డీఎస్పీ వెంకట శివయ్య, ఎస్‌డీఆర్ఎఫ్ ఎస్ఐ రాధాకృష్ణ పాల్గొని విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్నిప్రమాదాల నివారణ, అత్యవసర పరిస్థితుల్లో సురక్షితంగా బయటపడే విధానాలను వివరించారు. అనంతరం అగ్నిమాపక శాఖ, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు మాక్ డ్రిల్స్ నిర్వహించి విద్యార్థులకు ప్రత్యక్షంగా రక్షణ చర్యలపై అవగాహన కల్పించాయి. విపత్తుల ప్రమాద తగ్గింపుపై నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. విపత్తుల వల్ల ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, యువత ఈ సందేశాన్ని కుటుంబాలకు, సమాజానికి చేరవేయాలని నిర్వాహకులు సూచించారు. కార్యక్రమంలో మై భారత్ జిల్లా యువజన అధికారి టి. ఇస్సయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వేంపల్లి రైతు బజార్ లో ఉల్లి, సన్న బియ్యం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలి....

– డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి.

వేంపల్లి మహి న్యూస్ అక్టోబర్ 13.: వేంపల్లి రైతు బజార్ లో ఉల్లి,సన్న బియ్యం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో సన్నబియ్యం, ఉల్లిపాయల ధరలు గత కొంతకాలంగా గణనీయంగా పెరిగాయని, సామాన్యుల వంటింటి బడ్జెట్ పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అన్నారు. సన్న బియ్యం ధర దాదాపు 25 శాతం పెరిగింది.బహిరంగ మార్కెట్లో కిలో సన్న బియ్యం ధర దాదాపు 85 రూపాయలు ఉంది. పెరుగుతున్న ధరల నుండి సామాన్యులకు ఉపశమనం కలిగించేటందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతు బజార్ల ద్వారా సబ్సిడీపై సన్నబియాన్ని అందిస్తుండడం హర్షనీయం.ప్రభుత్వం బిపిటి సన్న బియ్యం కిలో 49 రూపాయలకు విక్రయిస్తూ ఉంది. అదేవిధంగా గత కొంతకాలంగా ఉల్లి ధరలు విపరీతంగా పెరిగాయి.ఓపెన్ మార్కెట్లో కిలో ఉల్లి ధర 55 నుంచి 70 రూపాయల వరకు ఉంది. రాష్ట్ర ప్రభుత్వం రైతు బజార్ల ద్వారా కిలో 35 రూపాయలకు అందిస్తోంది.కానీ వేంపల్లి రైతు బజార్ లో ఇంతవరకు ప్రభుత్వం సన్నబియ్యం, ఉల్లి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయలేదు. వెంటనే ఏర్పాటు చేసి సామాన్య ప్రజలను ఆదుకోవాలని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగం రామకృష్ణారెడ్డి, కడప జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం,పులివెందుల నియోజకవర్గం సమన్వయకర్త ధ్రువ కుమార్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్నాథ్ రెడ్డి, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉత్తన్న తదితరులు పాల్గొన్నారు.

## బీసీల రాజకీయ, ఆర్థిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి: టీడీపీ నేతలు

రాయచోటి, మహిన్యూస్, అక్టోబర్ 13: బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంపొందించడంతో పాటు, వారి ఆర్థిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని టీడీపీ మండల అధ్యక్షుడు గండికోట సుధాకర్, సంబేపల్లి మండల క్లస్టర్ ఇన్‌చార్జి విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. రాయచోటిలోని మండిపల్లి భవన్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ, 1987లో దివంగత నందమూరి తారక రామారావు స్థానిక సంస్థల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించి, గ్రామస్థాయి నుంచి బీసీ నాయకత్వం ఎదిగేందుకు పునాది వేశారని పేర్కొన్నారు. అనంతరం చంద్రబాబు నాయుడు రిజర్వేషన్లను 34 శాతానికి పెంచి బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని మరింత పెంచారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తదనంతరం వచ్చిన ప్రభుత్వాలు కూడా ఈ రిజర్వేషన్లను కొనసాగించాయని, అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీ రిజర్వేషన్లు 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గడం వల్ల బీసీల రాజకీయ ప్రాతినిధ్యానికి నష్టం కలిగిందని ఆరోపించారు. రాజకీయ రిజర్వేషన్లతో పాటు బీసీ వృత్తుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, వడ్డెరలకు మైనింగ్ లీజుల్లో 33 శాతం కేటాయింపు, గీత కార్మికులకు ఎక్సైజ్ దుకాణాల్లో 10 శాతం కేటాయింపు, నేతన్నలకు చేయూత, ఉచిత విద్యుత్ పథకాలు, మత్స్యకారుల సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. సెలూన్లకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, దేవాలయాల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణుల వేతనాన్ని నెలకు రూ.25,000కు పెంచి వారి కుటుంబాలకు అండగా నిలుస్తున్నామని తెలిపారు. బీసీల రాజకీయ, ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు చెన్న కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## మారనున్న గాలివీడు సంత రూపురేఖలు

### రూ.70 లక్షలతో మార్కెట్ యార్డు నిర్మాణం..

గాలివీడు: అక్టోబరు 13 (మహి న్యూస్): గాలివీడు మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుక భాగంలో నూతన మార్కెట్ యార్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మార్కెట్ యార్డు నిర్మాణానికి పంచాయతీరాజ్ నిధుల నుంచి రూ.70 లక్షలు కేటాయించగా, మంగళవారం లక్ష్మీప్రసాద్ రెడ్డి భూమిపూజ నిర్వహించారు. ఈ నిధులతో 10ఐ10 అడుగుల విస్తీర్ణంలో 166 షెడ్లు నిర్మించనున్నారు. వీటితోపాటు సిమెంట్ రహదారులు, డ్రైనేజీ కాలువలు, పార్కింగ్ తదితర సౌకర్యాలు కల్పించనున్నారు. రైతులు, కూరగాయల వ్యాపారులు, ప్రజలకు అనుకూలంగా ఉండేలా పనులు చేపట్టాలని లక్ష్మీప్రసాద్ రెడ్డి అధికారులకు సూచించారు.

### రైతుల కష్టాలకు పరిష్కారం

ఇప్పటివరకు సంతలో సరైన వసతులు లేక రైతులు, వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని లక్ష్మీప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఎండాకాలంలో కూరగాయలు వాడిపోవడం, వర్షాకాలంలో తడిసిపోవడం వల్ల రైతులు నష్టపోయే పరిస్థితులు ఉన్నాయన్నారు. ఎండ, వాన నుంచి పంట ఉత్పత్తులను కాపాడుకునేందుకు తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాల్సి వస్తోందని తెలిపారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతోపాటు రైతులు, వ్యాపారులకు మెరుగైన వసతులు కల్పించాలనే లక్ష్యంతో మార్కెట్ యార్డును నిర్మిస్తున్నట్లు వివరించారు. నిర్మాణం పూర్తయితే సంతకు వచ్చే రైతులు, వ్యాపారులకు సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. ఈ కార్యక్రమంలో మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మండిపల్లి అభిమానులు, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల బరిలోకి టీడీపీ ఆశావహులు

### అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ.. పార్టీ నిర్ణయమే కీలకం: దీపక్ రెడ్డి

కడప, మహి న్యూస్ అక్టోబర్ 13: స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న తెలుగుదేశం పార్టీ ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. కడప జిల్లా టీడీపీ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకుడు దీపక్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు భూపేష్ రెడ్డి పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఆశావహులతో మాట్లాడి వారి అభిప్రాయాలు, ఆయా ప్రాంతాల్లోని స్థానిక పరిస్థితులు, ఎన్నికలకు సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు.

### పార్టీ మార్గదర్శకాల మేరకే ఎంపిక

అభ్యర్థుల ఎంపికలో పార్టీ నిర్ణయమే ప్రాధాన్యంగా ఉంటుందని దీపక్ రెడ్డి తెలిపారు. పార్టీ మార్గదర్శకాలు, నాయకత్వం తీసుకునే నిర్ణయాలకు అనుగుణంగా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంపై, కూటమిపై నమ్మకంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అధిక సంఖ్యలో ఆశావహులు దరఖాస్తులు చేసుకోవడం సంతోషకరమని ఆయన అన్నారు.

### వైకాపాపై దీపక్ రెడ్డి విమర్శలు

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు వైకాపాకు అభ్యర్థులు కూడా లేని పరిస్థితి నెలకొందని దీపక్ రెడ్డి విమర్శించారు. పార్టీ శ్రేణులు ఎన్నికలకు సిద్ధమవుతూ, పార్టీ నిర్ణయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని ఈ సందర్భంగా సూచించారు.

# ప్రత్యేక అవసరాలు కలిగిన బాలికల సంరక్షణకు ముందడుగు!

### బాలికల కోసం ప్రత్యేక సంరక్షణ గృహాల నిర్వహణకు స్వచ్ఛంద సంస్థల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

### అక్టోబర్ 31 వరకు దరఖాస్తుల స్వీకరణ

కడప జిల్లా, మహి న్యూస్, అక్టోబర్ 13: ప్రత్యేక అవసరాలు కలిగిన బాలికలకు రక్షణ, సంరక్షణ, అవసరమైన సదుపాయాలు కల్పించే లక్ష్యంతో కడప జిల్లాలోని మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బాలికల సంరక్షణ గృహం నిర్వహణకు స్వచ్ఛంద సేవా సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. అర్హత కలిగిన సంస్థలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

#### అధికారిక అంతర్జాల వేదికలో వివరాలు

ప్రత్యేక బాలికల సంరక్షణ గృహం నిర్వహణకు సంబంధించిన మార్గదర్శకాలు, నిబంధనలు, ఇతర వివరాలను కడప జిల్లా అధికారిక అంతర్జాల వేదిక ఎఒఒఒ.ఎఒఒఒజుూ.అఐఒ.అఐ ద్వారా తెలుసుకోవచ్చని ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన స్వచ్ఛంద సంస్థలు నిబంధనలను పూర్తిగా పరిశీలించి దరఖాస్తులు సమర్పించాలి.

#### అక్టోబర్ 31 వరకు గడువు

దరఖాస్తుల సమర్పణకు 2026 అక్టోబర్ 31వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువు విధించారు. నిర్ణీత గడువులోగా సంబంధిత అధికారులకు దరఖాస్తులు అందజేయాలి.

#### సంబంధిత కార్యాలయంలో దరఖాస్తుల సమర్పణ

దరఖాస్తులను కడప జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారత అధికారి కార్యాలయంలో సమర్పించాలి. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ కొనసాగనుంది. నిర్ణీత గడువు ముగిసిన తర్వాత అందే దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోబోమని ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ మేరకు జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారత అధికారి పి. రామదేవి ప్రకటన విడుదల చేశారు.

# ఈపీఎఫ్ఓ వేతన పరిమితి రూ.25 వేలకు పెంపు!

### కొత్తగా అర్హత పొందిన ఉద్యోగులకు పీఎఫ్ పరిధిలోకి వచ్చే అవకాశం

కడప, మహి న్యూస్, అక్టోబర్ 13: ఉద్యోగుల భవిష్య నిధి చందాదారులకు సంబంధించి వేతన పరిమితిని నెలకు రూ.15 వేల నుంచి రూ.25 వేలకు పెంచినట్లు పేర్కొంటూ ఈపీఎఫ్ఓ ప్రాంతీయ కార్యాలయం పత్రికా ప్రకటన విడుదల చేసింది. ఈ మార్పు 2026 సెప్టెంబర్ 17 నుంచి అమల్లోకి వచ్చినట్లు ప్రకటనలో వెల్లడించింది. కొత్త వేతన పరిమితి అమలుతో ఇప్పటివరకు ఉద్యోగుల భవిష్య నిధి పరిధిలోకి రాని మరికొందరు ఉద్యోగులకు కూడా పీఎఫ్ సదుపాయం పొందే అవకాశం కలుగుతుందని ప్రకటనలో వివరించారు. ఉద్యోగుల భవిష్య నిధి, ఉద్యోగుల పెన్షన్ పథకం, ఉద్యోగుల డిపాజిట్ అనుసంధాన బీమా పథకం వంటి ప్రయోజనాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

#### ఉద్యోగుల వివరాల నమోదు తప్పనిసరి

సంస్థలు తమ ఉద్యోగుల రికార్డులను సరిచూసి, అర్హులైన ఉద్యోగులను ఈపీఎఫ్ఓ పరిధిలో నమోదు చేయాలని సూచించారు. ఉద్యోగుల విశ్వవ్యాప్త ఖాతా సంఖ్య, ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు, నెలవారీ చందాలకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయాలని పేర్కొన్నారు. చందాల వివరాలను ఎలక్ట్రానిక్ చలాన్ కమ్ రిటర్న్ ద్వారా సమర్పించాలని సూచించారు.

#### అక్టోబర్ 31 వరకు నమోదు అవకాశం

కొత్త నిబంధనల ప్రకారం అర్హత పొందిన ఉద్యోగులను గుర్తించి, వారి వివరాలను నమోదు చేయాలని ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తగా అర్హత పొందిన ఉద్యోగుల చందాలను జమ చేసేందుకు సంబంధిత సంస్థలు నిర్ణీత గడువులోపు ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ప్రకటన ప్రకారం ఈ నమోదు ప్రక్రియకు 2026 అక్టోబర్ 15 నుంచి అక్టోబర్ 31 వరకు అవకాశం కల్పించారు.

#### యాజమాన్యాలకు ఈపీఎఫ్ఓ సూచన

అర్హులైన ఉద్యోగులందరికీ సామాజిక భద్రతా ప్రయోజనాలు అందేలా యాజమాన్యాలు సహకరించాలని ఈపీఎఫ్ఓ ప్రాంతీయ కార్యాలయం సూచించింది. ఉద్యోగుల వివరాలను సక్రమంగా నమోదు చేసి, వర్తించే చందాలను నిర్ణీత సమయంలో జమ చేయాలని తెలిపింది ఈ మేరకు కడప ప్రాంతీయ భవిష్య నిధి కమిషనర్ సి. రవితేజ కుమార్ రెడ్డి పేరుతో పత్రికా ప్రకటన విడుదలైంది.

## జమాలుల్లా బాబా దర్గాలో నూతన బోరు ప్రారంభం

రాయచోటి, మహిన్యూస్, అక్టోబర్ 13: రాయచోటి పట్టణంలోని పాత రాయచోటిలో ప్రసిద్ధిగాంచిన జమాలుల్లా బాబా దర్గాలో నూతన బోరును డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. దర్గా ప్రాంగణంలో నీటి సౌకర్యం లేక ప్రార్థనల కోసం వచ్చే ముస్లిం సోదరులు, సోదరీమణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని దర్గా కమిటీ సభ్యులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన ఆయన బోరు బండిని పంపించి నూతన బోరు వేయించడంతో దర్గాలో నీటి సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ఈ సందర్భంగా దర్గా కమిటీ సభ్యులు రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి, గాజుల ఖాదర్‌బాషాలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో రాయచోటి మరింత అభివృద్ధి చెందాలని, వారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు, సంఘసేవకుడు మైనుద్దీన్, స్కూల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ బర్కత్, తెలుగుదేశం పార్టీ 19వ వార్డు అధ్యక్షుడు సాగీర్, అమీర్ భాష, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## నాలుగోసారి కాంగ్రెస్ ఓడిపోవడం ఖాయం.. అమిత్‌షా

న్యూఢిల్లీ: ఎస్ఐఆర్ కంటే ముందు కాంగ్రెస్ ఎన్ని ఎన్నికల్లో గెలిచిందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రశ్నించారు. ప్రజల మద్దతు కోసం రాహుల్ ఇష్టారీతిన అబద్ధాలు చెబుతున్నారన్నారు. ఇండి కూటమి నేతలపై మంగళవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ మాట్లాడారు.రాహుల్ దురుద్దేశంతోనే ఎస్ఐఆర్ ప్రక్రియపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని 2029 ఎ?న్నికల్లో ప్రజలు ఎవరివైపు ఉంటారో తేల్చుకుందామని కాంగ్రెస్ కు సవాల్ విసిరారు. రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ మిత్రపక్షాలు 2029 సార్వత్రిక ఎన్నికల్లో మరో ఘోర పరాజయానికి సిద్ధంగా ఉండాలని అమిత్ షా హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో కూడా ఎన్డీఏ పూర్తి మెజారిటీతో అధికారంలోకి రాబోతోందని, కాంగ్రెస్‌కు వరుసగా ఇది నాలుగో ఓటమి కాబోతోందని జోస్యం చెప్పారు. రాహుల్ గాంధీ ఎస్ఐఆర్ ప్రక్రియను వ్యతిరేకించడం వెనుక ఉన్న అసలు ఉద్దేశం చొరబాటుదారులను రక్షించడమేనని అమిత్ షా ఆరోపించారు. కాంగ్రెస్ ఆడుతున్న ఈ రాజకీయ రంగులను దేశ ప్రజలు పూర్తిగా అర్థం చేసుకున్నారని, వారి మాటలను నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. రాజ్యాంగ సంస్థలపై బురదజల్లడం రాహుల్‌కు అలవాటుగా మారిందని ఎన్నికల్లో ఓడిపోయిన ప్రతిసారీ ఆత్మపరిశీలన చేసుకోకుండా... ఎన్నికల సంఘం, ఈవీఎంలు లేదా సుప్రీంకోర్టు వంటి రాజ్యాంగ సంస్థలపై బురదజల్లడం ఏంటని ప్రశ్నించారు. ప్రజల మద్దతు కోల్పోయిన రాహుల్ గాంధీ, కేవలం దురుద్దేశంతోనే ఇష్టారీతిన అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# యువతరం ఉద్యమిస్తోంది.. అధికారం దిగివస్తోంది!

సోషల్ మీడియా నుంచి వీధిపోరాటం వరకు జెన్‌జీ పరుగులు
గత రెండేళ్లలో 39 దేశాల్లో యువత నేతృత్వంలో నిరసనలు

అమరావతి: చేతిలో స్మార్ట్‌ఫోన్.. సోషల్ మీడియాలో ప్రచారం.. వీధుల్లో నిరసనలు.. ఇదీ నేటి యువత పోరాట తీరు. అవినీతి, నిరుద్యోగం, ధరల పెరుగుదల, ప్రభుత్వాల వైఫల్యాలపై యువత గళమెత్తుతోంది. విద్యార్థులతో మొదలైన ఆందోళనలు ప్రభుత్వాలనే కదిలిస్తున్నాయి. కొన్నిచోట్ల ప్రధానులు, అధ్యక్షులు పదవులు వదులుకోవాల్సి వస్తుండగా.. మరికొన్ని దేశాల్లో ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక నిర్ణయాలను వెనక్కి తీసుకుంటున్నాయి. మనదేశంలో నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో ఏకంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేత రాజీనామా చేయించాయి కాక్రోచ్ జనతా పార్టీ (నీజేపీ) నేతృత్వంలోని ఈ బొద్దింకలు ఇప్పుడు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలంటూ దేశ రాజధానితో పాటు అన్ని రాష్ట్రాల్లోను జెన్‌జీ ఆందోళన నిర్వహిస్తోంది. ఏపీలోనూ మెగా డీఎస్సీ కుంభకోణానికి వ్యతిరేకంగా యువత తాజాగా ఉద్యమించింది.ఈ నేపథ్యంలో గేట్‌వే హౌస్ ఈ నెల 8న ప్రచురించిన 'ది అవుట్‌కమ్స్ ఆఫ్ గ్లోబల్ యూత్ మూవ్‌మెంట్స్' అధ్యయనం ఈ పరిణామాలపై ఆసక్తికర విషయాలను బయటపెట్టింది. 2024 జనవరి నుంచి 2026 జూన్ వరకు 39 దేశాల్లో యువత నేతృత్వంలో నిరసనలు నమోదైనట్లు వెల్లడించింది. వీటిలో 19 దేశాల్లో ప్రభుత్వాలు నిరసనకారుల డిమాండ్లకు కొంతమేర అంగీకరించడం, విధాన నిర్ణయాలను మార్చడం లేదా అధికారులు రాజీనామా చేయడం వంటి పరిణామాలు జరిగాయి. నాలుగు దేశాల్లో ఉద్యమాల ఫలితాలు ఇంకా తేలలేదు. అయితే కౌన్సిల్ ఆన్ ఫారిన్ రిలేషన్స్ (సీఎఫ్ఆర్) విశ్లేషణ ప్రకారం.. యువత ఉద్యమం ప్రభుత్వాన్ని ప్రభావితం చేయగలిగినా, ఆ తర్వాత అవినీతిని తగ్గించడం, ఆర్థికవ్యవస్థను మెరుగుపరచడం, వ్యవస్థాగత సంస్కరణలు అమలు చేయడం వంటి సవాళ్లు కొనసాగుతూనే ఉన్నాయి.

### బంగ్లాదేశ్‌లో పాలనకు చరమగీతం

2024లో ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా బంగ్లాదేశ్‌లో విద్యార్థులు ఉద్యమం చేపట్టారు. అవినీతి, అధికార దుర్వినియోగంపై యువత గళమెత్తింది. నిరసనలు ఉధృతం కావడంతో అప్పటి ప్రధాని షేక్ హసీనా దేశం విడిచి వెళ్లాల్సి వచ్చింది. ఆమె సుదీర్ఘపాలన ముగిసింది.

### శ్రీలంకలో అధ్యక్షుడి రాజీనామా

2022లో శ్రీలంక తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంది.

ఇంధనం, ఆహారం, మందుల కొరత ప్రజలను ఇబ్బందులకు గురిచేసింది. ప్రభుత్వ వైఫల్యాలపై యువతతో పాటు ప్రజలు 'అరగలయ' పేరుతో ఉద్యమించారు. నిరసనలు దేశవ్యాప్తంగా విస్తరించడంతో అధ్యక్షుడు గొటబాయ రాజపక్స రాజీనామా చేశారు.

### నేపాల్‌లో జెన్‌జీ ప్రకంపనలు

2025లో నేపాల్‌లో సోషల్ మీడియా వేదికలపై నిషేధం, అవినీతి, రాజకీయ నాయకుల కుటుంబాల విలాసవంతమైన జీవనశైలిపై యువత నిరసనలకు దిగింది. పోలీసుల కాల్పుల్లో నిరసనకారులు మరణించడంతో ఆందోళనలు మరింత ఉధృతమయ్యాయి. దేశవ్యాప్తంగా నిరసనలు విస్తరించడంతో ప్రధాని కేపీ శర్మ ఓలీ రాజీనామా చేశారు.

### కెన్యాలో పన్నుల బిల్లుకు బ్రేక్

2024లో కెన్యా ప్రభుత్వం ప్రతిపాదించిన పన్నుల పెంపునకు వ్యతిరేకంగా యువత పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టింది. సోషల్ మీడియా ద్వారా సమీకరణ, వీధుల్లో ఆందోళనలతో ప్రభుత్వం ఒత్తిడికి గురైంది. అధ్యక్షుడు విలియం రూటో ప్రతిపాదిత ఆర్థిక బిల్లును వెనక్కి తీసుకున్నారు. అనంతరం మంత్రివర్గంలో భారీ మార్పులు చేపట్టారు.

### మరికొన్ని దేశాల్లోనూ ఇదే తీరు

ఇండోనేషియా: 2025లో ఎంపీలకు అదనపు భత్యాలపై నిరసనలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం ఆ ప్రయోజనాలకు సంబంధించిన నిర్ణయాలను వెనక్కి తీసుకుంది.

మడగాస్కర్: నీరు, విద్యుత్ సమస్యలు, అవినీతిపై యువత ఆందోళనలు చేపట్టింది. నిరసనల అనంతరం అధ్యక్షుడు ఆండ్రి రాజోలినా అధికారాన్ని కోల్పోయారు.

ఫిలిప్పీన్స్, పెరూ: 2025లో పెద్ద ఎత్తున నిరసనల నేపథ్యంలో ఉన్నతస్థాయి ప్రభుత్వ అధికారులు రాజీనామా చేసినట్లు సీఎఫ్ఆర్ విశ్లేషణ పేర్కొంది.

తైమూర్--లెస్టే: పార్లమెంటు సభ్యులకు ప్రత్యేక ప్రయోజనాలు, మాజీ ప్రజాప్రతినిధులకు జీవితకాల పెన్షన్లపై వ్యతిరేకత వ్యక్తమవడంతో ప్రభుత్వం ఆ ప్రయోజనాలను రద్దు చేసింది.

యూనిసెఫ్ అధ్యయనంలో కీలక అంశాలు

యూనిసెఫ్ ఇన్నోసెంటీ కార్యాలయం 2024 మార్చిలో ప్రచురించిన యూత్, ప్రొటెస్ట్స్ అండ్ ది పాలీక్రైసిస్ నివేదిక యువత నిరసనల వెనుక ఉన్న కారణాలు, వాటి ప్రభావాలను విశ్లేషించింది. ఈ అధ్యయనం ప్రకారం..

‘ యువత సంప్రదాయ రాజకీయ మార్గాల కంటే నిరసనలు, ప్రత్యక్ష కార్యాచరణ ద్వారా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి ఎక్కువగా మొగ్గు చూపుతోంది.

‘ రాజకీయ, ఆర్థిక, సామాజిక, పర్యావరణ సమస్యలు యువతను ఉద్యమాల వైపు నడిపిస్తున్నాయి.

‘ డిజిటల్ వేదికలు నిరసనకారులను సమీకరించడంలో, సమాచారాన్ని వేగంగా వ్యాప్తిచేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి.

‘ యువత భాగస్వామ్యంతో జరిగే ఉద్యమాలు ఎక్కువమందిని కలుపుకొని సాగడం, వినూత్న పద్ధతులను ఉపయోగించడం వల్ల ప్రభావవంతంగా మారే అవకాశముంది.

‘ ఉద్యమం విజయవంతమైనా యువతకు ప్రత్యక్షంగా ఉద్యోగాలు, మెరుగైన జీవన ప్రమాణాలు వంటి ప్రయోజనాలు అందుతాయని హామీలేదని నివేదిక హెచ్చరించింది.

### సోషల్ మీడియా నుంచి వీధి పోరాటం వరకు

ప్రస్తుత యువత ఉద్యమాల్లో సోషల్ మీడియా కీలక సాధనంగా మారిందని గేట్‌వే హౌస్ అధ్యయనం పేర్కొంది. వాట్సప్, ఇన్‌స్ట్రాగామ్, ఫేస్‌బుక్, ఎక్స్, టెలిగ్రామ్, యూట్యూబ్ వంటి సామాజిక వేదికల ద్వారా ప్రచారం, సమీకరణ సాగుతున్నాయని వివరించింది. అనేక ఉద్యమాలకు ఒకే నాయకత్వం ఉండకపోవడం, స్థానిక సమస్యల ఆధారంగా ప్రజలు స్వచ్ఛందంగా సమీకృతం కావడం మరో ప్రత్యేకతగా గుర్తించింది. అయితే అన్ని ఉద్యమాలు ఒకే విధమైన ఫలితాలను సాధించలేదు. కొన్ని ప్రభుత్వాలను మార్చగా.. మరికొన్ని విధానాల ఉపసంహరణతోనే ఆగిపోయాయి. ఇంకొన్ని దేశాల్లో నిరసనకారుల డిమాండ్లను ప్రభుత్వాలు పట్టించుకోలేదు. అందువల్ల సోషల్ మీడియా ప్రచారంతో పాటు విస్తృత ప్రజామద్దతు, స్పష్టమైన డిమాండ్లు, ప్రజాస్వామ్యసంస్థల సహకారం కూడా కీలకమని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

## బీసీలకు న్యాయం చేసింది వైఎస్ జగన్ మాత్రమే.. మార్గాని భరత్

తాడేపల్లి: బీసీ రిజర్వేషన్ల విషయంలో చంద్రబాబు మాటలకు, చేతలకు పొంతన లేదని మాజీ ఎంపీ మార్గాని భరత్ అన్నారు. బీసీలకు మేలు చేసింది మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మాత్రమేనని.. గతంలోనే 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జగన్ ప్రభుత్వం జీవో జారీ చేసిందని తెలిపారు. ఈ రోజు మంగళవారం తాడేపల్లిలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. చంద్రబాబు బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు దక్కకుండా చేశారని ధ్వజమెత్తారు. భరత్ మాట్లాడుతూ.. చంద్రబాబు బిర్రు ప్రతాప్ రెడ్డితో కోర్టులో కేసు వేయించారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు దక్కకుండా చేశారు. బిర్రు ప్రతాప్ రెడ్డికి టీడీపీతో సంబంధం లేదని చంద్రబాబు చెప్పగలరా?చంద్రబాబు హయాంలో బిర్రు ప్రతాప్ రెడ్డికి ప్రభుత్వంలో కీలకమైన పోస్టులు కట్టబెట్టారు. చంద్రబాబు, నారా లోకేష్‌లతో బిర్రు ప్రతాప్ రెడ్డికి సన్నిహిత సంబంధాలున్నాయిటీడీపీతో సంబంధాలున్న వ్యక్తి కోర్టులో కేసు వేస్తే, ఆ పార్టీ అప్పుడే ఎందుకు అడ్డుకోలేదు? హైకోర్టులో కేసు విచారణ సమయంలో టీడీపీ ఎందుకు ఇంప్లీడ్ కాలేదు? అని చంద్రబాబు నాయుడుని ప్రశ్నించారు. హైకోర్టు తీర్పు తర్వాత రామ్మోహన్ నాయుడుతో సుప్రీంకోర్టులో పిటిషన్ వేయించడం రాజకీయ నాటకం కాదా? బీసీలకు అన్యాయం చేసి, తిరిగి వైఎస్సార్‌సీపీపై నిందలు వేయడం చంద్రబాబు ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో 13